క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువత దృష్టిని ఆటల వైపు మళ్లించి క్రీడా తెలంగాణగా తీర్చిదిద్దడమే సీఎం కప్ ముఖ్య ఉద్దేశమని స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. 'సీఎం కప్' క్రీడా జ్యోతి మంగళవారం ఉదయం జిల్లాకు చేరుకుంది. లక్ష్మీదేవిపల్లి 'సెంట్రల్ పార్క్' వద్ద ర్యాలీని శివసేనారెడ్డితో పాటు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తదితరులు స్వాగతించారు. శివసేనారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులకు కావాల్సిన అన్ని సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఇండోర్ స్టేడియం పనులను పూర్తిచేయిస్తామన్నారు. స్పోర్ట్స్ అథారిటీకి కొత్తగూడెంలో స్థలాన్ని సూచిస్తే అన్ని సౌకర్యాలతో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయడానికి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన ప్రకటించారు. వచ్చే ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే సీఎం రేవంత్‌రెడ్డి కోరిక అని వివరించారు. అనంతరం కలెక్టర్ జితేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడావకాశాల్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలల్లో వ్యాయామ విద్యను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తూ.. గ్రామీణుల్లోని క్రీడాప్రతిభను వెలికితీయడమే 'సీఎం కప్' లక్ష్యమని ఎమ్మెల్యే ఆదినారాయణ అన్నారు. డీసీఎంబీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డీవైఎస్‌వో పరంధామరెడ్డి, ఎస్జీఎఫ్ కార్యదర్శి నరేశ్, టార్చ్ రిలే బృందం, నోడల్ అధికారి మధు, గోకుల్, బోస్, కోచ్ గౌస్, డీఎస్పీ అబ్దుల్ రెహ్మాన్ పాల్గొన్నారు.


జిల్లాలో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, చిత్రంలో శివసేనారెడ్డి, ఎస్పీ రోహిత్‌రాజ్, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తదితరులు

టీచరమ్మ.. నీకు తిరుగేలేదమ్మ!!

పాల్వంచ విద్యావిభాగం, ఖమ్మం విద్యా విభాగం, న్యూస్‌టుడే

విద్యావంతులైన మహిళలు ప్రభుత్వ కొలువుల సాధనలో ముందంజలో నిలుస్తున్నారు. పురుష అభ్యర్థులతో సమానంగా పోటీ పడుతున్నారు. గతంలో పోలీస్ ఉద్యోగాల భర్తీలో మహిళా పోస్టులకు విపరీతమైన పోటీ నెలకొనడం విశేషం. ఆ తర్వాత అటవీ శాఖ ఉద్యోగాల్లోనూ క్లిష్టమైన పరీక్షలెదుర్కొని ప్రతిభచూపిన వారెందరో ఉన్నారు. వారు సుదీర్ఘ నడక సాగించి మరీ తమ పట్టుదలను నిరూపించారు. తాజాగా నియామక ప్రక్రియ పూర్తయిన 'డీఎస్సీ-2024'లో ఉమ్మడి జిల్లాలో పురుషుల కన్నా ఎక్కువ మంది మహిళా అభ్యర్థులే ఉపాధ్యాయ కొలువు చేపట్టారు. కేటాయించిన విద్యాలయాల్లో వారు నేటి (బుధ వారం) నుంచి బోధన చేపట్టనున్నారు.

తాజా డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ), ప్రత్యేక విద్య, వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు భర్తీ చేశారు. ఇవి ప్రభుత్వ, స్థానిక సంస్థల విద్యాలయాల వారీగా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో మొత్తం 520కిగాను మహిళా అభ్యర్థులే 268 మంది (51.53శాతం) ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పోస్టులకు పురుషులు 28, మహిళలు 30 మంది ఎంపికయ్యారు. స్థానిక సంస్థల పాఠశాలల్లో చేరుతున్నవారిలో పురుషులు 224, మహిళలు 238 మంది ఉన్నారు. ప్రాథమిక విద్యాలయాల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు బోధన చేస్తారు. ఈ పోస్టుల్లో మహిళలదే హవా కనిపించింది. మొత్తం 293కిగాను 185 వారే దక్కించుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మొత్తం 413కి గాను 223 (54 శాతం) పోస్టులు మహిళలవే. ఎస్జీటీ పోస్టుల్లో పురుషులు 95, మహిళలు ఏకంగా 156 పోస్టులు సాధించి శెభాష్ అనిపించుకున్నారు.




కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయినుల సందడి..

ఏఏ పోస్టులకు ఎంతమంది..

సబ్జెక్టు	మహిళలు	పురుషులు
పండిట్-హిందీ	02	01
పండిట్-తెలుగు	04	02
పీఈటీ	1	-
స్కూల్ అసిస్టెంట్		
బయాలజికల్ సైన్స్	14	09
ఆంగ్లం	07	07
హిందీ	04	01
గణితం	05	18
ఫిజికల్ డైరెక్టర్	03	01
ఫిజికల్ సైన్స్	04	04
సోషల్	11	28
తెలుగు	03	05
ప్రత్యేక విద్య-ఎస్జీటీ	09	10
ఎస్జీటీ-తెలుగు	156	95

ఫలించిన.. 23 ఏళ్ల నిరీక్షణ!



డీఎస్సీ కొలువు కల 23 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఫలించిందామెకు. తాజా నోటిఫికేషన్‌లో హిందీ పండిట్‌గా ఉద్యోగాన్ని సాధించి.. చర్ల మండలం తేగడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నేడు (బుధ వారం) బాధ్యతలు చేపట్టనున్నారు. ఆమే.. **తురుమెళ్ల కళ్యాణి.**

కొత్తగూడెంకు చెందిన కళ్యాణి సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల ఒప్పంద ఉపాధ్యాయురాలు. ఎంఏ హిందీ పండిట్ పూర్తిచేసి.. గత 23 ఏళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయ పరీక్షలు రాస్తున్నారు. అదే సమయంలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తూ వస్తున్నారు. గత ఎనిమిదేళ్లుగా సింగరేణి పాఠశాలలో బోధన కొనసాగిస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు కవయిత్రి, రచయిత, రేడియో వ్యాఖ్యాత ప్రవృత్తిలో రాణిసున్నారు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో జిల్లా నాలుగో ర్యాంకు సాధించి విజయం సాధించారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు సాయి సుజాత, ఉపాధ్యాయుల అభినందనలు అందుకున్నారు.

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

పంచాయతీల సమగ్రాభివృద్ధికి కృషి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మణుగూరు, బూర్గంపాడు, న్యూస్‌టుడే: పంచాయతీల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బూర్గంపాడు మండలం తాళ్ల గొమ్మూరులో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనం, ఐటీసీ ఆధ్వర్యంలో నిర్మించిన అంగన్‌వాడీ పాఠశాల భవనాన్ని మంత్రి పొంగులేటి మంగళవారం ప్రారంభించారు. మరో కార్యక్రమంలో భాగంగా.. మణుగూరులో ఐటీడీఏ నిధులు రూ.1.80 కోట్లతో నిర్మించే గిరిజన ఆశ్రమ పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి కూడా ఆయన భూమిపూజ నిర్వహించారు. అనంతరం ప్రకాశవనంలోని సింగరేణి సామాజిక భవనంలో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ జితేశ్ వి. పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎస్పీ రోహిత్ రాజ్ డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, డా.తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఐటీసీ ఉన్నతాధికారులు శ్యామ్‌కిరణ్, చెంగల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలి..

పారిశ్రామిక ప్రాంతం సారపాకలో ఈఎస్ఐ ఆధ్వర్యంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని కోరుతూ ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు కార్మిక సంఘం టీఎన్‌టీయూసీ, మిత్రపక్షాల ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. ఆసుపత్రి లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కనకమేడల హరిప్రసాద్, పోటు రంగారావు, తాళ్లూరి జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే పాయం తదితరులు

శస్త్రచికిత్స చేయించండి సారూ?

మానవీయం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: పుట్టుకతో వచ్చే కొన్ని వ్యాధులు బాధితులను జీవితకాలం పట్టిపీడిస్తున్నాయి. వీటిల్లో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ఒకటి. వ్యాధిగ్రస్థులు జీవిత కాలం రక్తాన్ని మార్చుకొంటూ ఉండాలి. పేదలైతే వారికి ఈ వ్యాధి ఒక శాపంలా మారుతోంది. కుటుంబం మొత్తం కుంగిపోవాల్సి వస్తోంది. కొత్తగూడెం 'ఏ' పవర్‌బస్తీకి చెందిన సలవాది కనకరాణి పరిస్థితే ఇందుకు ఉదాహరణ. ఆమె భర్త సుందర్ కార్పెంటర్ హెల్పర్. వచ్చే కొద్దిపాటి సంపాదన మొత్తాన్ని భార్య వైద్యానికే వెచ్చిస్తున్నారు. జన్యుపరలోపం ఉన్నట్లు కనకరాణికి ముందుగా తెలియలేదు. గర్భం దాల్చినప్పుడు నిర్వహించిన రక్త పరీక్షలో బయటపడింది. అప్పట్నుంచి నెలలో కనీసం రెండుసార్లు దాతలను వెంట తీసుకెళ్లి మరీ ఆసుపత్రుల్లో రక్తమార్పిడి చేయించుకుంటున్నారు. పైగా, 'ఏ' పాజిటివ్ రక్తం కావడంతో దాతల కోసం వేచిచూడాల్సి వస్తోంది. వేరే గ్రూపు దాతలను తీసుకెళ్లినా.. సంబంధిత వర్గం రక్తం నిల్వలు దొరికే వరకు నిరీక్షణ తప్పడం లేదు. ఆయా సందర్భాల్లో ఆమె నీరసం చెందుతున్నారు. రక్త మార్పిడిలో కొంత ఆలస్యమైనా కాలేయం వద్ద వాపు సమస్య పెరుగుతోంది. వైద్యారోగ్య శాఖాధికారులు స్పందించి మెరుగైన వైద్యం అందేలా చూడాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.


సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న కనకరాణి

కణితితో తీవ్ర అనారోగ్య సమస్య

కనకరాణికి కొంతకాలం క్రితం కాలేయం వద్ద కణితి ఏర్పడింది. దీన్ని తొలగించేందుకు శస్త్రచికిత్స చేయాలి. సికిల్‌సెల్ ఉన్నందున స్థానిక వైద్యులెవరూ ఆపరేషన్‌కు ముందుకు రావడం లేదు. హైదరాబాద్‌లోని పెద్దాసుపత్రులను ఆశ్రయించాలని చెప్పారు. చేతిలో చిల్లిగవ్వ లేని బాధితురాలు తన బాధను నాయకుల ద్వారా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లారు. వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి వైద్య సేవలు, తగిన ప్రభుత్వ సాయం అందేలా చూస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

413 మంది ఉపాధ్యాయులు.. నేడు విధుల్లోకి!

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: 'డీఎస్సీ-2024'లో ఉపాధ్యాయులుగా నియమితులైన అభ్యర్థులకు పోస్టింగ్ కల్పించేందుకు పాతకొత్తగూడెం ఆనందఖని జిల్లా విద్యా వనరుల కేంద్రంలో కౌన్సెలింగ్‌ను మంగళవారం నిర్వహించారు. కొత్త ఉపాధ్యాయులంతా తరలిరావడంతో ప్రక్రియ సందడి వాతావరణంలో కొనసాగింది. ఉదయం ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్‌ను ఆలస్యంగా మధ్యాహ్నం 2 గంటలకు విద్యా శాఖాధికారులు ప్రారంభించారు. తొలుత హాజరు నమోదు చేపట్టారు. మధ్యాహ్నం అనంతరం రావాలని సూచించారు. డీఈఓ ముమ్మడి వెంకటేశ్వరాచారి ఆధ్వర్యంలో మొత్తం 413 మంది ఉపాధ్యాయులకు 23 మండలాల్లోని ప్రభుత్వ, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలను కేటాయించారు. ఆర్డర్ కాపీలను అందజేశారు. బుధవారం నుంచే పాఠశాలల్లో రిపోర్టు చేసి బోధన ఆరంభించాలని డీఈవో సూచించారు. కౌన్సెలింగ్ మధ్యాహ్నానికి వాయిదా పడటంతో దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు ఇబ్బంది పడ్డారు.


ఫిజికల్ డైరెక్టర్ మంజులకు నియామక పత్రాన్ని అందజేస్తున్న డీఈవో వెంకటేశ్వరాచారి

ఘనంగా సీతారామ కల్యాణోత్సవం




రామయ్యను దర్శించుకున్న శివసేనారెడ్డి

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. ప్రధాన ఆలయంలో కొలువైన కోదండ రాముడికి సుప్రభాతం పలికి ఆరాధించారు. క్షేత్ర విశిష్టతను ప్రవచించారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం కన్యాదానం చేసి గోత్ర నామాలను చదివారు. సీతాదేవికి యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీత ధారణ నిర్వహించారు. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక పరమానందకరంగా సాగాయి. దర్బారు సేవలో హరిదాసులు ఆలపించిన కీర్తనలు ఆధ్యాత్మికతను నింపాయి. ఆంజనేయ స్వామికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. అంజన్న భక్తులు సింధూరాన్ని నుదుట ధరించి ఆలయ ప్రదక్షిణ చేశారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి రామయ్యను దర్శించుకున్నారు. పీఆర్వో సాయిబాబా, వేద పండితుడు హనుమత్‌శాస్త్రి సాదర స్వాగతం పలికారు.

చిరుతపులి కదలికలపై నిఘా: ఎఫ్ఆర్వో

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడు అటవీరేంజి పరిధిలో చిరుత పులి కదలికలపై నిఘా పెట్టినట్లు జూలూరుపాడు అటవీ రేంజి అధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మంగళవారం జూలూరుపాడు, తల్లాడ అటవీరేంజి అధికారులు, సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహించారు. పులి జాడలను రాజుపాలెం బీట్ మున్యాతండా పంట పొలాల్లో గుర్తించారు. సిబ్బంది అక్కడకు వెళ్లి రైతులు, కూలీలకు సూచనలిచ్చారు. ఎర్రగుట్ట పరిసరాల్లో సంచరిస్తున్న చిరుత వయసు సుమారు మూడేళ్లు ఉండవచ్చని చెప్పారు. ఎఫ్ఆర్వో వెంట తల్లాడ డీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.


రాజుపాలెం బీట్‌లో రైతులకు జాగ్రత్తలు చెబుతున్న అటవీశాఖ అధికారులు

మానసిక ఒత్తిళ్లకు గురికావొద్దు: ఎస్పీ

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: వృత్తి, కుటుంబ పరంగా ఎలాంటి సమస్యలున్నా పోలీసు అధికారులు, సిబ్బంది మానసిక ఒత్తిడికి గురికావొద్దని ఎస్పీ బి.రోహిత్‌రాజు అన్నారు. జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందితో మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి గురువారం సిబ్బందితో తమ సమస్యల పరిష్కారానికి నేరుగా తనను సంప్రదించవచ్చని వివరించారు. ఇటీవల జిల్లాలో జరిగిన సంఘటనలు తనను ఎంతో బాధించాయని విచారం వ్యక్తం చేశారు. క్షణికావేశానికి గురై కుటుంబాల గురించి ఆలోచించకుండా ప్రాణాలు తీసుకోవడం బాధాకరమన్నారు. శాంతి, భద్రతల పరిరక్షణ, బందోబస్తు, వరదల సమయంలో విధులు, మావోయిస్టుల కార్యకలాపాలను అరికట్టడం, గంజాయి అక్రమ రవాణాను నివారించడంలో కర్తవ్యాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం కాన్ఫరెన్స్ ద్వారా కొంతమంది తమ సమస్యలను ఎస్పీకి వివరించగా.. పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.


టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

పాపికొండల విహార యాత్రకు బ్రేక్..

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: దసరాకు ప్రారంభించిన పాపికొండల విహారయాత్రను మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఏపీ అధికారులు నిలిపివేశారు. తుపాను కారణంగా లాంచీ విహార యాత్ర నిలిపివేసినట్లు సమాచారం. తుపాను తగ్గిన అనంతరం విహార యాత్ర లాంచీలు నడుస్తాయని నిర్వాహకులు వెల్లడించారు.

సింగరేణి యువ కార్మికులకు సదుపాయాలివీ..

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల్లో చేరే వారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారు. ఇప్పటి వరకు కారుణ్య నియామకాల్లో 15 వేల మందికి పైగా పలు కొలువుల్లో చేరారు. వీరితో పాటు మరో 6 వేల మంది పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉద్యోగాలు చేపట్టారు. భూగర్భ గనుల్లో 190 రోజులు, ఇతర ప్రదేశాల్లో 240 రోజులు పనిచేస్తే వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తిస్తారు. లేదంటే బదిలీ వర్కర్లుగానే పరిగణిస్తారు. బదిలీ వర్కర్లంటే.. సింగరేణి ఉద్యోగంలో తొలిమెట్టు. ఈ స్థాయి ఉద్యోగంలో సుమారు 8 వేల మంది పనిచేస్తున్నారు. వీరికి కార్మిక చట్టం ప్రకారం పలు సదుపాయాలు, సౌకర్యాలు వర్తిస్తాయి. ఈ విషయంపై చాలా మందికి అవగాహన కొరవడుతోంది. సంస్థ నుంచి రాయితీలు సైతం పొందే వెసులుబాటుంది. అవేమిటంటే..


విధుల్లో యువ ఉద్యోగుల ఉత్సాహం..

అలవెన్సులు, సదుపాయాలిలా..

- గనుల చట్టం ప్రకారం భూగర్భగనుల్లో 16 హాజర్లకు ఒక సెలవు, ఇతరులకు 20 హాజర్లకు ఒక సెలవు వర్తిస్తుంది.
- ఒక క్యాలెండర్ సంవత్సరంలో భూగర్భగనుల్లో 190, సర్ఫేస్‌లో 240 రోజుల హాజరు నమోదైతే క్యాజువల్ సెలవులు, ఇంటి రాయితీ, అదనపు రవాణా అలవెన్స్, కన్వేయన్స్ అలవెన్స్, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ సదుపాయం అమలవుతుంది.
- కొలువులో చేరాక వరుసగా ఆర్నెల్లు విధులు నిర్వర్తించిన వారికి సిక్ లీవ్స్, పండుగ సెలవులు ఇస్తారు. తొలి ఆర్నెల్ల సర్వీసులో భూగర్భగనుల్లో కనీసం 95, ఇతర ప్రదేశాల్లో 120 రోజులు హాజరు నమోదై ఉండాలి. ఆ తర్వాత సంబంధిత ఏడాది మిగతా కాలాన్ని లెక్కించి సిక్ లీవ్స్ ఇస్తారు. ఏడాది తర్వాత పండుగ సెలవులు ఉంటాయి.
- కంపెనీలో చేరిన నాటినుంచే ఇన్సెంటివ్, మూణ్నెల్ల బోనస్‌లు, గ్యాస్ రాయితీ, 5 శాతం ప్రత్యేక అలవెన్సు సదుపాయం కల్పిస్తారు.
- బదిలీ ఫిల్లర్లను ప్లే డేలలో(సెలవురోజుల్లో) పనిచేయడానికి నియమించరు. ఒకవేళ నియమిస్తే వారికి ప్లేడే అలవెన్సు ఇస్తారు.
- వరుసగా ఏడాది సర్వీసు పూర్తిచేసిన వారికి లేఆఫ్ కాంపెన్సేషన్ వర్తిస్తుంది.

'ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలను కొనసాగిద్దాం'

చర్ల, న్యూస్‌టుడే: పౌరహక్కుల నేత ప్రొఫెసర్ సాయిబాబా మృతిపట్ల మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. సాయిబాబా ఆశయాలను కొనసాగించాలని మావోయిస్టు రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ మంగళవారం విడుదల చేసిన లేఖలో పిలుపునిచ్చారు. పౌర హక్కులను పరిరక్షించేందుకు ప్రజల తరఫున గొంతెత్తిన సాయిబాబాను బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు రాజ్యమే పథకం ప్రకారం హత్య చేసిందని ఆరోపించారు. ప్రొఫెసర్‌గా కొనసాగుతూ తెలంగాణ మలిదశ ఉద్యమానికి మార్గనిర్దేశం చేశారని కొనియాడారు. పౌరుల ప్రాథమిక హక్కుల కోసం సాయిబాబా ఎన్నో పోరాటాలు సాగించారన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రశ్నించే శక్తులను తయారు చేయడం నేరంగా భావించే రాజ్యం కుట్రపూరితంగా సాయిబాబా కంప్యూటర్లోకి మావోయిస్టుల సాహిత్యాన్ని చొప్పించి ఆయనపై అక్రమంగా నింద మోపిందని ఆరోపించారు. మొక్కవోని ధైర్యంతో రాజ్యాన్ని ప్రశ్నించిన ప్రజాస్వామికవాది, ప్రజల పక్షపాతిగా పోరాడిన యోధుడు ప్రొఫెసర్ సాయిబాబాకు తమ పార్టీ జోహార్లు అర్పిస్తోందన్నారు.

ఉమ్మడి జిల్లాలో రహదారుల అభివృద్ధికి రూ.180 కోట్లు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో గ్రామీణ రహదారులను తారు రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి 84 పనులకు రూ.180 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రహదారుల అభివృద్ధికి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఆమోదంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం జిల్లాలో 43 పనులకు రూ.105 కోట్లు, భద్రాద్రి జిల్లాలో 41 పనులకు రూ.75 కోట్లు మంజూరు చేశారు. భద్రాచలం నియోజకవర్గంలో 5 పనులకు రూ.15 కోట్లు, అశ్వారావుపేటలో 7 పనులకు రూ.15 కోట్లు, కొత్తగూడెంలో 6 పనులకు రూ.15 కోట్లు, పినపాకలో 9 పనులకు రూ.15 కోట్లు, ఇల్లెందులో 14 పనులకు రూ.15 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో పల్లెల్లో మట్టి రోడ్లను తారు రోడ్లుగా అభివృద్ధి చేయనున్నారు. త్వరలో టెండర్లు నిర్వహించి పనులు చేపట్టనున్నారు.

రంగులద్ది.. వక్రబుద్ధి!

తెల్లగా మారిన నల్లబెల్లం.. ఏడు నెలల్లో 3 టన్నుల పట్టివేత

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే

గుడుంబా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం రవాణాపై నిషేధం ఉంది. ఎక్కడ కనిపించినా కఠిన చర్యలు తీసుకుంటున్నా.. అబ్కారీ పోలీసులు. దీంతో తయారీదారులు 'రంగు' మార్చారు. కొత్త ఎత్తులతో అధికారులను ఏమార్చుతున్నారు. అదెలాగంటే..

ఖమ్మం జిల్లా సరిహద్దులోని మహబూబాబాద్, భద్రాచలం ఏజెన్సీలో కొన్నాళ్లుగా గుడుంబా తయారవుతోంది. అక్కడకు పలు మార్గాల్లో నల్లబెల్లం అక్రమంగా తరలుతోంది. మరోవైపు అబ్కారీ బృందాలు గాలింపులు కొనసాగుతున్నాయి. బెల్లం ఊటను పెద్ద ఎత్తున ధ్వంసం చేస్తున్నారు. అయినా తమ కళ్లుగప్పి నల్లబెల్లాన్ని ఎలా తరలిస్తున్నారని పోలీసులు అవాక్కవుతున్నారు. లోతుగా పరిశీలిస్తే అసలు రంగు బయటపడింది. ఇల్లెందు సమీపంలో ఇటీవల ఓ వాహనంలో తరలుతున్న 9 టన్నుల బెల్లం కొత్తగూడెం జిల్లా అబ్కారీ పోలీసులకు పట్టుబడింది. చూస్తే పైపైన మొత్తం తాజా తెల్ల బెల్లంలా కనిపించింది. కానీ తరచి చూస్తే అదంతా నల్లబెల్లమే! దాన్నంతా రసాయనాలు చల్లి రంగు మార్చినట్లు అధికారులు గుర్తించారు. సరకంతా నాలుగు రోజుల తర్వాత పూర్తిగా నలుపు రంగులోకి మారుతుందని తెలిసి నివ్వెరబోయారు. ఇదిలా ఉంటే.. రంగు మార్చిన బెల్లాన్ని ఈ ఏడాది జూన్ నుంచి జులై వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో 3,018 కిలోలు పట్టుకున్నారు. గుట్టుగా తరలించిన సరకు ఇంతకు ఐదు రెట్లు ఉంటుందని అంచనా.


రంగు మారుతున్న బెల్లం ముద్దలు

ఎక్కడెక్కడ తయారవుతోందంటే?

బెల్లం తయారీ కేంద్రాల్లో మిగిలిన వ్యర్థాలు, మగ్గిన పదార్థాలను కిలో రూ.20కి కొనుగోలు చేస్తున్నారు. దానిపై తెల్లటి రసాయనాలు చల్లి రంగు మార్చుతున్నారు. గుడుంబా తయారీదారులకు కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. నిల్వలను సైతం కాలం చెల్లిన వాహనాల్లోనే తరలిస్తున్నారు. తనిఖీల భయం, ధరాభారంతో కొందరు రూటు మార్చారు. గుడుంబాను చక్కెరతో తయారుచేస్తున్నారు. తెలుపుదనం కోసం పటికకు బదులు చైనా నుంచి తెప్పించే తెల్లని పొడిని వాడుతున్నారు. ఈస్ట్ సైతం వినియోగిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో గుడుంబా తయారీని ఎలా కట్టడి చేయాలా? అని అబ్కారీ శాఖ తలలుపట్టుకుంటోంది.

ముమ్మర తనిఖీలు చేపడతాం..

ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ గణేష్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు జిల్లా టాస్క్‌ఫోర్స్, స్థానిక స్టేషన్ బృందాలతో కలిసి గుడుంబా తయారీపై నిఘా పెంచాం. బెల్లం రంగు మారుస్తున్న విషయాన్ని పసిగట్టాం. సరకు తరలకుండా ముమ్మర తనిఖీలు కొనసాగిస్తాం' అని చెప్పారు.

ఇవి తాగితే అనారోగ్యంపాలు

రఘునాథపాలెం, న్యూస్‌టుడే



ఉదయం నిద్ర లేవగానే టీ తాగకపోతే కొంతమందికి పొద్దు గడవదు.. పిల్లలకు పాలు, అన్నంలోకి పెరుగు, మజ్జిగ తయారీకి పాలు నిత్యావసరంగా మారాయి. ఇటువంటి క్షీరాన్ని కొంతమంది ప్రబుద్ధులు కల్తీ చేస్తున్నారు. గతంలో చిక్కని పాలల్లో కాసిన్ని నీళ్లు కలిపేవారు. ఇప్పుడు ఏకంగా నకిలీ పాలను తయారు చేస్తున్నారు. కొంతమంది విషపూరిత డిటర్జెంట్, యూరియా వంటివి కలుపుతున్నారు. పాల కల్తీపై జిల్లాలో కేసులు నమోదవుతున్నాయి. నమ్మకమైన వ్యక్తుల/సంస్థల నుంచి కొనుగోలు చేయాలని, అనుమానం వస్తే పరీక్షించి చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

★ ఉమ్మడి జిల్లాలో పాల ఉత్పత్తి తగ్గుతోంది. డిమాండ్ పెరుగుతోంది. దీంతో కొంతమంది కల్తీకి పాల్పడుతున్నారు. అపరిశుభ్రమైన నీరు కలపడంతోపాటు విష రసాయనాలు మిళితం చేస్తున్నారు. కొన్ని రకాల పొడులు, నురగ వచ్చేలా సబ్బు పొడి, తెల్లదనం కోసం యూరియా కలుపుతున్నట్లు గతంలో పోలీసులు గుర్తించారు. కల్తీ పాలను వినియోగిస్తే అనారోగ్యం, దీర్ఘకాలిక సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నమోదైన కేసులు	
2022–23	15
2023–24(నేటి వరకు..)	8

మరింత అప్రమత్తంగా ఉండాలి



పాల కల్తీతో ప్రజారోగ్యానికి తీవ్రమైన హాని కలుగుతుంది. సరైన పోషకాలు అందకపోతే పిల్లల ఎదుగుదల, మానసిక వికాసం జరగదు. పాల కల్తీ నేరం. అప్రమత్తంగా ఉంటూ, ప్రజలు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుని కల్తీ వినియోగాన్ని అడ్డుకోవచ్చు.

- లగడపాటి వెంకటేశ్వరరావు, విశ్రాంత మేనేజరు, డెయిరీ టెక్నాలజిస్టు

గుర్తించే పద్ధతులు

☛ **నీళ్లు కలిపిన పాలు:** ఓ చుక్క పాలను నున్నని, ఏటవాలు ప్రదేశంలో ఉంచినప్పుడు స్వచ్ఛమైనవి నెమ్మదిగా కదులుతూ అవి జారిన తలంపై తెల్లని మచ్చ ఏర్పడుతుంది. నీళ్లు కలిసినవి త్వరగా ప్రవహించి, ఎటువంటి మచ్చ జాడ కనిపించదు.

☛ **పిండి పదార్థాల కల్తీ:** పాలలో కొన్ని చుక్కల అయోడిన్ ద్రావణాన్ని కలిపినప్పుడు నీలి రంగుకు మారితే పిండి పదార్థాల కల్తీ జరిగినట్లు.

☛ **యూరియా కలిపితే..:** టీస్పూను పాలకు అర చెంచా సోయాబీన్ పిండిని కలిపి మిశ్రమాన్ని బాగా కలియదిప్పి 5 నిమిషాల తరువాత ఆ పాలలో ఎర్ర లిట్మస్ కాగితాన్ని ముంచితే నీలి రంగుకు మారుతుంది. లిట్మస్ పేపర్లు అన్ని మందుల దుకాణాల్లో లభిస్తాయి.

☛ **డిటర్జెంట్ కల్తీ:** 5 మిలీ పాలు, 5 మిలీ నీళ్లు కలిపి బాగా కలియ తిప్పితే నురగ ఏర్పడితే డిటర్జెంట్ కల్తీ జరిగినట్లు.

☛ **కృత్రిమ పాలు:** చేదు రుచి కలిగి, వేళ్ల మధ్యలో తీసుకొని రుద్దినప్పుడు సబ్బు వంటి భావన కలుగుతుంది. వేడి చేసినప్పుడు పసుపు రంగుకు మారతాయి. కృత్రిమ పాల తయారీకి నీళ్లు, రంగులు, చౌక నూనెల, క్షార ద్రావణాలు, యూరియా, డిటర్జెంట్లు వాడతారు.

ఒక్క పోస్టూ లేకపాయె..!

డిప్యూటేషన్లు, సీఆర్టీ సిబ్బందితో నెట్టుకొస్తున్న గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలు

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే



ఈ చిత్రంలో కనిపించేది ఖమ్మం గ్రామీణ మండలం గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల. శాశ్వత భవనం, వసతి గృహంతోపాటు అన్ని సదుపాయాలూ ఉన్నాయి. పాఠశాలలో 400ల మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఖమ్మంలోని గిరిజన ఆశ్రమ బాలికల వసతి గృహాన్ని 2013లో ఆశ్రమ పాఠశాలగా మార్చారు. 2016లో గొల్లగూడెంలోని శాశ్వత భవనంలోకి దీన్ని చేర్చారు. ఈ పాఠశాల ఏర్పాటై 11 ఏళ్లు అవుతున్నా ఇప్పటివరకు ఒక్క ఉపాధ్యాయ పోస్టు మంజూరు కాలేదు. ప్రస్తుతం పాఠశాలలో అయిదుగురు డిప్యూటేషన్‌పై, 12 మంది సీఆర్‌టీ (ఒప్పంద) పద్ధతిలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యార్థులు చదివే పాఠశాలలకు, ఉండే వసతి గృహాల మధ్య దూరం ఉండేది. రాకపోకలు సాగించేందుకు విద్యార్థులకు ఇబ్బందయ్యేది. ఆడపిల్లల విషయంలో భద్రతాపరమైన సమస్యలూ తలెత్తేవి. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఏపీలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన వసతి గృహాలను ఆశ్రమ పాఠశాలలుగా మారుస్తూ 2012లో నాటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి అనుగుణంగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మొత్తం 15 పాఠశాలలను గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలుగా మార్చారు. 2012లో ఒక్కటి, 2013లో 14 ఏర్పాటయ్యాయి.

పాఠశాలలివే..

ఖమ్మం.. ముదిగొండ మండలం వల్లభి, ఖమ్మం గ్రామీణం గొల్లగూడెం, కామేపల్లి, కల్లూరు, సత్తుపల్లిలో గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలు

◆ ఖమ్మం ముస్తఫానగర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, రేవతి సెంటర్‌లో బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల (ఈ రెండు పాఠశాలలు ప్రస్తుతం కొణిజర్ల మండలంలోకి మార్చారు.)

◆ సత్తుపల్లిలో ఏర్పాటు చేసిన ఆశ్రమ పాఠశాలను కొంతకాలానికే మూసేశారు.

భద్రాద్రి

◆ ఇల్లెందు(ఎ), భద్రాచలం-బిలో బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల

◆ ఇల్లెందు(బి), మణుగూరు, అశ్వారావుపేట, జూలూరుపాడు మండలంలోని పడమటి నర్సాపురం, భద్రాచలం-ఎ, బూర్గంపాడులో బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలు.

ఉపాధ్యాయులు కరవు

15 పాఠశాలల్లో ప్రస్తుతం 14 మాత్రమే ఉన్నాయి. అన్ని చోట్లా డిప్యూటేషన్‌పైన, ఒప్పంద ఉపాధ్యాయులతోనే నెట్టుకొస్తున్నారు. 11 ఏళ్లుగా ప్రభుత్వాలు ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ప్రభుత్వం తమ పరిధిలో పోస్టులు కేటాయించి, భర్తీ చేసుకుంది. తెలంగాణలో ఆ ప్రక్రియ ప్రారంభానికి నోచుకోలేదు. ఫలితంగా వేల మంది విద్యార్థులు చదువుకుంటున్న విద్యాలయాల్లో శాశ్వత ఉపాధ్యాయులే కరవయ్యారు. భవనాలు, వసతి గృహాలు ఉన్నా బోధకులు లేకుండానే కొనసాగుతున్నాయి. స్థానిక అధికారులే చొరవ తీసుకొని డిప్యూటేషన్‌పైన కొంత మంది ఉపాధ్యాయులను నియమించి, మరికొంత మందిని సీఆర్‌టీ (ఒప్పంద ఉపాధ్యాయులు)లను నియమించి ఏ ఏడాదికి ఆ ఏడాది విద్యాసంవత్సరాన్ని ముగించేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

విజయలక్ష్మి, ఐటీడీఏ డీడీ

ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. పోస్టుల మంజూరుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

17నుంచి గెలల సేకరణ నిలిపివేత

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ఆయిల్‌పాం గెలలు తక్కువగా వస్తున్న కారణంగా ఈనెల 17నుంచి అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో వార్షిక మెయింటెనెన్సు చేపడుతున్నామని.. ఈ నేపథ్యంలో ఆయిల్‌పాం గెలల సేకరణను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు టీజీ ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆ రోజు నుంచి దమ్మపేట మండలం అప్పారావుపేట పరిశ్రమకు యథావిధిగా గెలలు తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బకాయిలు చెల్లించే వరకు కళాశాలలు తెరవలేం

యాజమాన్యాల సంఘం స్పష్టీకరణ

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రెండోరోజూ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు మూతపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించనందుకు నిరసనగా యాజమాన్యాలు కళాశాలలకు తాళాలు వేశాయి. బకాయిలు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన యాజమాన్యాల బాధ్యులు మంగళవారం ఖమ్మంలో సమావేశమయ్యారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సమస్య పరిష్కారమయ్యే వరకు కళాశాలలు తెరిచేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి మద్ది ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌జేసీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గుండాల కృష్ణ, కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ కోట అప్పిరెడ్డి, డీఆర్‌ఎస్ కళాశాల కరస్పాండెంట్ వి.మోహన్‌రెడ్డి, ప్రియదర్శిని కళాశాల కరస్పాండెంట్ కాటేపల్లి నవీన్‌బాబు, గాయత్రి కళాశాల కరస్పాండెంట్ కుతుంబాక సునీల్‌కుమార్ పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న మద్ది ప్రభాకర్‌రెడ్డి, గుండాల కృష్ణ, కోట అప్పిరెడ్డి, కాటేపల్లి నవీన్‌బాబు, మోహన్‌రెడ్డి, సునీల్‌కుమార్

పచ్చని చెట్లు.. తివాచీ పరిచినట్లు!



పినపాక మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల పచ్చని చెట్లతో కళకళలాడుతోంది. ప్రధాన ద్వారం నుంచి పాఠశాల సముదాయం, వసతిగృహం వరకు సీసీ రహదారికి ఇరువైపులా హరితహారం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నాటిన మొక్కలు ప్రస్తుతం తోరణాల్లా మారాయి. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తున్నాయి. – పినపాక, న్యూస్‌టుడే

నిండుకున్న తటాకం.. కరవు తీర్చిన ఉపాయం



ఈ దఫా వర్షాకాలంలో విస్తారంగా వర్షాలు కురిసినా చెరువుల్లో నీరు సమృద్ధిగా లేవు. ఫలితంగా ఓ రైతు ట్రాక్టర్‌నే విద్యుత్తు మోటారుగా మార్చి అర కిలో మీటర్ వరకు పైపులు అమర్చి పొలానికి నీళ్లు సరఫరా చేస్తున్నారు. మణుగూరులోని ముత్యాలమ్మనగర్ రహదారి పక్కనే ఉన్న పొలాలకు సరిపడా నీరు అందడంలేదు. స్థానిక ఆయకట్టుకు నీరందించే చెరువులో కనీసం తూము వరకు కూడా నీళ్లు లేవు. ఈక్రమంలో కణితి రమేష్ అనే రైతు తన బంధువులకు సంబంధించిన వరి పొలానికి చెరువు నుంచి నీరు అందించేందుకు ఏకంగా తన ట్రాక్టర్‌కే మోటారును బిగించారు. చెరువులో పైపులను వదిలి దూరంగా ఉన్న పంటకు నీరు సరఫరా చేస్తున్నాడు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ట్రాక్టర్ మోటారు ద్వారానే పొలానికి నీళ్లు తరలించాడు. – మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

తగ్గిందా.. కిక్కు?



వైరా, న్యూస్‌టుడే: దసరా సీజన్ నేపథ్యంలో అమాంతం పెరగాల్సిన మద్యం అమ్మకాలు ఉమ్మడి జిల్లాలో కాస్త తగ్గుముఖం పట్టాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 210 మద్యం దుకాణాలు, 50 బార్లు, 3 క్లబ్బులున్నాయి. సహజంగా దసరా వంటి ముఖ్యమైన పండగ సమయంలో మద్యంప్రియులు తమ జోష్ కనబరుస్తుంటారు. కానీ ఈసారి మాత్రం అమ్మకాలు తగ్గాయి. ఈనెల 14వ తేదీ వరకు అమ్మకాలు రూ.48.14 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా గతేడాది అక్టోబరు 14 వరకు రూ.49.90 కోట్ల అమ్మకాలు జరిగాయి. మద్యం అమ్మకాలను గతేడాది నెలతో పోల్చుతూ లక్ష్యాలను నిర్దేశిస్తుంటారు. దీని ప్రకారం సుమారు రూ.1.76 కోట్ల అమ్మకాలు తగ్గినట్లు అధికారులు గుర్తించారు. గతేడాది అక్టోబరు నెల మొత్తంగా రూ.141 కోట్లు జరిగాయి. కానీ ఈసారి ఆ మార్కును దాటుతారో లేదో చూడాల్సి ఉంది. అమ్మకాలు బాగా తగ్గుతుండటంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు దుకాణాల వారీగా అమ్మకాలు పెంచాలని, డిపో నుంచి ఎక్కువ మద్యం కొనుగోలు చేయాలంటూ దుకాణదారులకు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం(15వ తేదీ) ఒక్కరోజే రూ.8.70 కోట్లు అమ్మకాలు జరిగాయి. ఏపీలో అన్ని రకాల బ్రాండ్లు లభిస్తుండటం కూడా మద్యం అమ్మకాలు తగ్గేందుకు మరో కారణంగా భావిస్తున్నారు.

రూ.6.80 కోట్లతో మార్కెట్ ఆధునికీకరణ

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణకు ప్రభుత్వం అదనంగా రూ.6.80 కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు రాష్ట్ర సహకార, మార్కెటింగ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేతశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే రూ.148.50 కోట్లు మంజూరు చేయించిన విషయం తెలిసిందే. ఇప్పుడు నిర్మాణ పనులకు మొత్తం రూ.155.30 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో మార్కెట్ స్వరూపమే మారనుంది. త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే సాధ్యమైనంత త్వరలో ఆధునికీకరణ పనులు సైతం చేపట్టనున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మంత్రి 'తుమ్మల' మార్కెట్‌లోనే ప్రభుత్వ ఆధ్వర్యంలోనే 80 వేల బస్తాల సామర్థ్యం కలిగిన శీతల గిడ్డంగిని నిర్మించాలనే యోచన చేశారు. దీంతో మార్కెట్‌కు మిరప పంట తెచ్చినప్పుడు ధర గిట్టుబాటు కాకుంటే ఇక్కడే నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది.

భక్తుల ఆదరణే శ్రీరామ రక్ష

భద్రాచలం, న్యూస్‌టుడే: 'దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దివ్య క్షేత్రం అభివృద్ధికి భక్తుల ఆదరణే శ్రీరామ రక్షగా నిలుస్తోంది. గత ఏడాది రూ.79 కోట్ల ఆదాయం రాగా ఈ సంవత్సరం రూ.100 కోట్ల రాబడి స్వామివారికి వచ్చేలా ఉద్యోగులు పని చేస్తున్నారని' రామాలయ ఈఓ రమాదేవి పేర్కొన్నారు. పూర్వం నుంచి ఇప్పటి వరకు రూ.లక్ష పైబడి వస్తు, వస్త్ర, ఆభరణ, వాహన, అన్నదానం, వసతి సదుపాయం నిమిత్తం విరాళాలు ఇచ్చిన దాతలను మంగళవారం ఆహ్వానించారు. దర్శనం అనంతరం దాతలకు ఆలయానికి చెందిన మారుతీ సదనంలో ఘన సన్మానం చేశారు. స్వామివారి చిత్ర పటాన్ని అందించి వేదాశీర్వచనం ఇచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వసతి భోజన సదుపాయం కల్పించారు. ఆలయ వివరాలను ఏవీ రూపంలో తెరపై ప్రదర్శించారు.

★ ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ 'గతంతో పోల్చితే వసతి సౌకర్యాలు మెరుగు పడ్డాయి. ఇంకా 100కు పైగా గదులను కుటీరాలను నిర్మించేందుకు అందరి నుంచి సంపూర్ణ సహకారం కావాలి. ఎంత మంది వచ్చినా అన్నదానం చేయాలని నిర్ణయించాం' అని తెలిపారు. 'రూ.12 లక్షలు చొప్పున భక్తులు ఇచ్చిన రూ.3.60 కోట్ల విరాళంతో 30 గదులున్న జానకీ సదనం ఇటీవల నిర్మించాం. ఇంకా కొన్ని గదుల నిర్మాణం కోసం దాతలు ముందుకు రావాలి. వసతి విభాగం పారిశుద్ధ్య నిర్వహణను ప్రముఖ సంస్థకు అప్పగిస్తున్నాం. భూములు ఆక్రమణలకు గురికాకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. తాగు నీటి కల్పనకు ముఖ్యమైన ప్రాంతాలలో జలప్రసాదం ఏర్పాటు చేశాం. ప్రసాదాల నాణ్యతకు ప్రాధాన్యతను ఇచ్చేందుకు దేవస్థానమే లడ్డూలను తయారు చేస్తోంది. నాణ్యతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం కోసం ప్రయత్నిస్తున్నాం. అనుబంధ ఆలయాలను సైతం అభివృద్ధి చేస్తున్నాం. పర్ణశాలలో ఉచిత ప్రసాదాలతో పాటు ఇక నుంచి ప్రతి శని, ఆదివారాలలో అన్నదానం చేస్తాం. శ్రీరామనవమికి ఇక్కడ నిర్వహించే కల్యాణాన్ని జగమంతా వీక్షిస్తుంది. ఇలాంటి దేవుడి సేవ అదృష్టంగా భావించాలి' అని వివరించారు. 'భక్తులు కోరుకుంటే అన్ని ప్రాంతాలకు రామరథంతో వచ్చి కల్యాణాలను నిర్వహిస్తాం. గిరిజన సంప్రదాయంలో 17న రామాలయంతో పాటు అశ్వారావుపేట మండలం వినాయకపురం సమీపంలో శబరి మాత ఉత్సవాన్ని గిరిజన సంప్రదాయంలో నిర్వహించనున్నామని' తెలిపారు. స్థానాచార్యులు స్థలసాయి మాట్లాడుతూ ఆనాడు భక్త రామదాసు రాములవారికి ఆలయం నిర్మించారని ఆ తర్వాత కాలంలో రాజా తూము లక్ష్మీనరసింహదాసు దీన్ని విస్తరించారని మొదటి నుంచి ఇది భక్తుల ఆదరణతోనే అభివృద్ధి చెందుతోందని వివరించారు. ప్రధానార్చకుడు విజయరాఘవన్, ఏఈఓ భవాని రామకృష్ణారావు, ఈఈ రవీంద్రనాథ్, రామాయణ పారాయణదారు కృష్ణమాచార్యులు, ప్రసాద అవధాని పాల్గొన్నారు.



దాతల సన్మాన సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ రమాదేవి

చదువుల తల్లికి ఆర్థిక సాయం

ఈనాడు కథనానికి స్పందన

సత్తుపల్లి, న్యూస్‌టుడే: వైద్య విద్యలో సీటు సాధించి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సత్తుపల్లి గుడిపాడులోని నిరుపేద కుటుంబమైన రాజిని ప్రసాద్, నాగమణి దంపతుల కుమార్తె శివభార్గవికి దాతలు అండగా నిలుస్తున్నారు. 'చదువుల తల్లికి సాయమందించరూ' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మానవతావాదులు స్పందించారు. సీఎంఓ కార్యాలయం నుంచి వేణుగోపాల్ సదరు విద్యార్థినికి ఫోన్ చేసి వివరాలడిగి తెలుసుకున్నారు. ఎన్‌ఆర్‌ఐ ఎ.కల్యాణ్ రూ.50వేలు, జాస్తి ఉమామహేశ్వరరావు రూ.10 వేలు, సాయిరాం రూ.10వేలు, దిలీప్‌రెడ్డి రూ.10 వేలు, మధుసూదన్‌రావు రూ.5వేలు, నిర్మలరాణి రూ.5వేలు, పోలూరి విజయసారథి రూ.3 వేలు, తన్నీరు సత్యనారాయణ, వెంకటేశ్వరమ్మ రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.95 వేలు ఆర్థిక సాయాన్ని ఫోన్ ద్వారా, ఆన్‌లైన్ బదిలీ ద్వారా అందజేశారు. నాలుగేళ్ల చదువుకు రూ.12.5 లక్షలు ఖర్చవుతున్న నేపథ్యంలో సాయమందిస్తామని కొంత మంది ఎన్‌ఆర్‌ఐలు విద్యార్థిని కుటుంబానికి ఫోన్ చేసి చెప్పారు.

రూ.3.50 లక్షల గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణ శివారులో వాహన తనిఖీల్లో రూ.3.50 లక్షల విలువైన 12.5 కిలోల గంజాయి మంగళవారం పట్టుకున్నట్లు ఆబ్కారీ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉన్నతాధికారుల ఆదేశాలు, విశ్వసనీయ సమాచారంతో ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రం కలిమెల సమీపంలోని మల్కానిగిరికి చెందిన ప్రదీప్ సర్కార్, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సమీపంలోని పాలగడ్డకు చెందిన ఇంద్రా ద్విచక్ర వాహనంపై రావడంతో ఆపి తనిఖీ చేయగా వారి వాహనంలో గంజాయి లభ్యమైంది. ఒడిశాలో కొనుగోలు చేసి హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు తరలిస్తున్నట్లు విచారణలో వారు వెల్లడించారు. వాహనాన్ని సీజ్‌చేసి నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో కరీం, బాలు, సుధీర్, హనుమంతు, హరీష్, విజయ్ పాల్గొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 10 కిలోలు..

మధిర, న్యూస్‌టుడే: కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పొట్లాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి తెలిపారు. మంగళవారం ఉదయం భువనేశ్వర్ నుంచి ముంబయి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేశారు. ఓ బోగీలో సుమారు 10 కిలోల బరువున్న నాలుగు గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వీటి రవాణాకు పాల్పడుతున్న వారి ఆచూకీ తెలియకపోవడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

★ మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను పాడుచేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి సూచించారు. మధిర మున్సిపాలిటీలోని జిలుగుమాడులో ఉన్న డ్రగ్స్ రీహ్యాబిలిటేషన్ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు దుర్మరణం



నరేశ్



సారయ్య



నాగరాజు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలవడంతో రహదారులు నెత్తురోడాయి. డివైడర్‌ను ఢీకొని ఇద్దరు మృతి చెందగా, బస్సు ఢీకొని మరో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. బూర్గంపాడు మండలం సొంపల్లి పంచాయతీ బుడ్డగూడెం గ్రామానికి చెందిన సొడె నరేశ్(34) తన బంధువైన సారయ్య(28)తో కలిసి పాల్వంచకు వచ్చారు. ఓ పని గురించి మాట్లాడుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో లక్ష్మీదేవిపల్లి(ఎస్) సమీపంలో విభాగినిని ఢీకొట్టారు. నరేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, సారయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పాల్వంచ ఏరియా ఆసుపత్రికి తీసుకొస్తుండటంతో మార్గంమధ్యలో మృతి చెందారు. నరేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు కాగా సారయ్య అవివాహితుడు. లక్ష్మీదేవిపల్లి(ఎస్) సాయిబాబా గుడి వద్ద నివాసం ఉంటున్న నాగరాజు(40) సమీపంలో ద్విచక్రవాహన ప్రమాదం చోటు చేసుకోవడంతో చూడటానికి వచ్చారు. అనంతరం రహదారి దాటే క్రమంలో బస్సు ఢీకొని మృతి చెందారు. భార్యతో పాటు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

ఇద్దరు 'పది' విద్యార్థులు..

చర్ల, న్యూస్‌టుడే: చర్ల మండలం సుబ్బంపేట వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందారు. మరో విద్యార్థి పాక్షిక గాయాలతో బయటపడ్డాడు. మండల పరిధిలోని జీపీపల్లికి చెందిన ఎంబటి మురళీ కృష్ణ(16), చర్లకు చెందిన చింతలపూడి రేవంత్‌రాజ్(15), లింగాపురంపాడుకు చెందిన యాకూబ్‌లు కలిసి ఎదురుగుట్టల వైపు నుంచి చర్లకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురు విద్యార్థులు చర్లలో పదో తరగతి చదువుతున్నారు. ద్విచక్ర వాహనంపై వస్తూ ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని అధిగమించే క్రమంలో ఎదురుగా వచ్చిన లారీ కింద పడిపోవడంతో రేవంత్‌రాజ్, మురళీకృష్ణలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదం నుంచి యాకూబ్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. సంఘటనా స్థలాన్ని సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



రేవంత్ రాజు



మురళీ కృష్ణ

చెరువులో పడి యువకుడు..

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: చెరువులో పడి ప్రమాదవశాత్తు ఓ యువకుడు మృతి చెందిన ఘటన మంగాపురం తండాలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. నేలకొండపల్లి మండలంలోని మంగాపురం తండాకు చెందిన ధనావత్ రామదాసు-లక్ష్మిలకు ఇద్దరు సంతానం. వీరిలో పెద్దవాడైన ధనావత్ గోపి(16) ఇంటర్ ప్రథమ సంవత్సరం స్థానిక నేలకొండపల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. ఈ మేరకు మంగళవారం తన స్నేహితులతో కలిసి మంగాపురం తండా శివారులో ఉన్న చెరువు మాదారానికి చెందిన చెరువులోకి ఈత కొట్టేందుకు వెళ్లారు. ఒక్కసారిగా నీటిలో మునిగిపోయాడు. తోటి స్నేహితులు భయంతో బయటికి వచ్చి జరిగిన విషయాన్ని తండావాసులకు తెలిపారు. నీటిలో మూర్ఛ వచ్చి మునిగిపోయి ఉంటాడని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

గుంతల్లో బైకు అదుపుతప్పి..

మణుగూరు, న్యూస్‌టుడే: మణుగూరు-తిర్లాపురం రహదారిపై సోమవారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ సతీశ్ తెలిపిన వివరాలు.. ఇసుక లారీల రాకపోకల నేపథ్యంలో రహదారిపై పెద్దపెద్ద గోతులు పడ్డాయి. ఆ మార్గంలో మునగల రవికుమార్(47) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ప్రధాన రహదారిపై ఉన్న గోతిలోకి ద్విచక్ర వాహనం వెళ్లడంతో కిందపడిపోయాడు. తీవ్రగాయాలపాలైన ఆయనను ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయాడు. సీఐ సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	5,500	7,000	6,700
పాతపత్తి	7,200	7,300	7,275
పెసలు	4,000	7,200	6,800
ఏసీ ఎండుమిరప	10,000	19,500	17,500
ఏసీతాలుమిరప	9,000	9,600	9,100
ఎండుమిరప	6,000	17,000	16,500
తాలుమిరప	6,000	7,000	6,500
మొక్కజొన్నలు	2,050	2,050	2,050

భద్రాచలం
• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

'కిసాన్ కాంగ్రెస్' ఉపాధ్యక్షుడి తొలగింపు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శి వెంకట సాంబశివరావును పదవి నుంచి తొలగిస్తున్నట్లు కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏలూరి కోటేశ్వరరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీతో పాటు నాయకులకు వ్యతిరేకంగా పని చేస్తున్నాడని, కార్యకర్తల్లోనూ అంతరం సృష్టిస్తున్నాడని పేర్కొన్నారు. ఆయనకు వ్యతిరేకంగా పలు ఫిర్యాదులు అందాయన్నారు. వెంకట సాంబశివరావు మాట్లాడుతూ భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అనుచరునిగా మండలంలో పనిచేస్తున్నానని, ఇది ఓర్వలేక, కొందరు తనపై అధిష్ఠానానికి లేనిపోని ఫిర్యాదులు చేశారని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధి రేగుబల్లికి చెందిన దళిత హిందూ మాలనాడు వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి వెంకటరావు (62) కిడ్నీ సంబంధిత వ్యాధితో సోమవారం రాత్రి మృతి చెందారు. ఆతని మృతదేహాన్ని మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక




హసీనా, వర్షిత హర్షవర్ధిని

పినపాక, న్యూస్‌టుడే: చదువుతోపాటు క్రీడల్లో సైతం రాణించాలనే వారి తపన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా చేసింది. మండల పరిధిలోని ఎల్చిరెడ్డిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న హసీనా, వర్షిత, హర్షవర్ధినితోపాటు 8వ తరగతి విద్యార్థినిలు సుజాత, కవిత సెప్టెంబరు 26, 27 తేదీలలో కొత్తగూడెం పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడల్లో సత్తాచాటారు. వాలీబాల్ క్రీడల్లో కీలకంగా వ్యవహరించిన పదో తరగతి విద్యార్థినిలు వర్షిత, హర్షవర్ధిని విజయకేతనం ఎగురవేశారు. ఖోఖో పోటీల్లో హసీనా, సుజాత, కవిత అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. జిల్లాస్థాయి ప్రథమస్థానంలో నిలిచిన వీరంతా రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించేందుకు వ్యాయామ ఉపాధ్యాయురాలు తాటి విజయ ఆధ్వర్యంలో ప్రత్యేక తర్ఫీదు పొందుతున్నారు. చదువుతోపాటు క్రీడల్లో సైతం ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వీరకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పడేనా..?

దమ్మపేట, న్యూస్‌టుడే



నియోజకవర్గంలో కీలకమైన దమ్మపేట మార్కెట్ కమిటీ పాలకవర్గ ఎన్నిక ఆ పార్టీలో కొత్త చిచ్చు రేపింది. ఈ కమిటీ అధ్యక్ష పదవి కోసం పార్టీలో తీవ్రమైన పోటీ నెలకొంది. కమిటీ అధ్యక్ష పదవి తమ కంటే తమకంటూ కాంగ్రెస్‌లో రెండు వర్గాలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మార్కెట్ కమిటీల పాలకవర్గాలు చకచకా నియామకాలు పూర్తి చేసుకుంటే.. దమ్మపేట మార్కెట్ కమిటీ పాలకవర్గ పంచాయితీ ఇప్పట్లో తేలేలా లేదు.

నియోజకవర్గంలో అత్యంత కీలకం..

దమ్మపేట మార్కెట్ కమిటీ అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఏకైక మార్కెట్ కమిటీ. ఈ కమిటీ పరిధిలో దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాలున్నాయి. ఎమ్మెల్యే తరువాత ఈ కమిటీ అధ్యక్షుడికే అత్యంత గౌరవం దక్కుతుంది. ఈ కమిటీకి పాలకవర్గ పదవీ కాలం ముగిసి దాదాపు ఎనిమిదేళ్లు కావస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పాలకవర్గ నియామకం జరగలేదు. ఈ కమిటీ అధ్యక్షపదవిని ఎస్టీ మహిళకు కేటాయించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ పదవిని దక్కించుకునేందుకు పోటీ అధికమైంది. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మార్కెట్ కమిటీ నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పాలకవర్గ సభ్యుల జాబితాను ఆయన సిద్ధం చేశారు. అక్కడే అసలు గొడవ మొదలైంది.

ఎమ్మెల్యే మాటతప్పారంటూ..

మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవిని దమ్మపేట మండలంలో ఎస్టీ నాయకపోడు కులానికి చెందిన ఓ కీలక నాయకుడి సతీమణికి ఇస్తానని ఎమ్మెల్యే తొలుత హామీ ఇచ్చి, మాటమార్చారని నియోజకవర్గంలో రచ్చ మొదలైంది. పాత కాంగ్రెస్‌కు చెందిన వారికే నామినేటెడ్ పదవుల్లో అగ్రపీఠమనే నెపంతో ఆయన నాయకపోడు కులానికి చెందిన మరొకరికి ఈ పదవిని కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగానే ఇటీవల దమ్మపేటలో జరిగిన మండల కాంగ్రెస్ సమావేశాన్ని ఓ వర్గ నాయకులు బహిష్కరించారు. ఎమ్మెల్యేపై బహిరంగ విమర్శలు గుప్పించారు. కావాలనే తమ వర్గాన్ని కించపరిచేలా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని అలకబూనారు. ఈ వ్యవహారంపై జిల్లాలో కీలకమైన ఓ మంత్రి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు కాంగ్రెస్‌లో చర్చ జరుగుతుంది. దీంతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకంపై ఎటూ తేల్చుకోలేని సంకటంలో పడినట్లు తెలుస్తోంది. ఇదంతా తేలేదాక మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకం మూలనపడినట్లేనని కాంగ్రెస్ వర్గాల సమాచారం.

మూగ జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం శాంతి నగర్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మంగళవారం ప్రారంభించారు. పశువైద్యులు వలీబాబా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయదారులు పశు సంపదను పెంపొందించుకోవాలన్నారు.

అశ్వారావుపేట గ్రామీణం: మండలంలోని గేదెలు, ఆవులు, దూడలు, ఎడ్లకు బుధవారం నుంచి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు ఆ శాఖ వైద్యురాలు డాక్టర్ స్వప్న తెలిపారు.



గేదెకు టీకా వేస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033



సమస్య: మండలంలోని పెంట్లం పంచాయతీ బాస్కరావు రంలో రహదారికి ఇరువైపులా మురుగు కాల్వలు లేకపోవడంతో ఇళ్లలోని మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. దీంతో అధిక దుర్వాసన వెదజల్లుతోంది. సమస్య పరిష్కరించాలి. - **కృష్ణ, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి, శుభ్రం చేయిస్తాం. - **సతీష్, పంచాయతీ కార్యదర్శి**
– **అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే**

పాత మామిళ్లవారిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే రహదారికి ఇరువైపుల పిచ్చిమొక్కలు పెరిగాయి. చిన్నారులు వెళ్లే ఈ దారిలో పిచ్చిమొక్కలు ఉండటంతో కీటకాలు, పాములు చేరే అవకాశం ఉంది. వీటిని తొలగించాలి, అలాగే గ్రామంలోని పలు వీధుల్లో చెత్తా చెదారం చేరి దుర్వాసన వస్తోంది. - **ఎం.నారాయణ, గ్రామస్థుడు**

✔ దారికి ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తాం. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి బ్లీచింగ్ చల్లించే ఏర్పాటు చేస్తాం. - **సబిత, పంచాయతీ కార్యదర్శి**
– **అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే**

దమ్మపేటలోని కొత్తపేట సంతబజార్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఎస్టీ బాలుర వసతిగృహం నుంచి దమ్మపేట ప్రధాన రహదారి వరకు డ్రైనేజీని అనుసంధానం చేయాల్సి ఉంది. డ్రైనేజీ సక్రమంగా లేక వరదనీరు, మురుగునీరు వసతిగృహంలోకి వచ్చి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - **శ్రీనివాసరావు, కొత్తపేట కాలనీ**

✔ కొత్తపేట ఎస్టీ బాలుర వసతిగృహం నుంచి తాత్కాలికంగా డ్రైనేజీని నిర్మిస్తాం. ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటాం.
- **ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి**
– **దమ్మపేట, న్యూస్‌టుడే**

ములకలపల్లి విజయపురి కాలనిలోని బీసీ హాస్టల్ సమీపంలో వీధి దీపం వెలగడం లేదు. మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలి. - **రమేష్**

✔ మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. - **రవి, పంచాయతీ కార్యదర్శి**
– **ములకలపల్లి, న్యూస్‌టుడే**



అశ్వారావుపేట మండలం గాండ్లగూడెం ప్రధాన వీధిలో చేతిపంపు నుంచి అనంతారం మార్గంలో రహదారి పైనే మురుగునీరు ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతోంది. వీధులన్నీ అపరిశుభ్రంగా ఉన్నాయి. - **శోభన్, గాండ్లగూడెం**

✔ నేను కొద్దిరోజుల క్రితమే బదిలీపై వచ్చి విధుల్లో చేరాను. వెంటనే వీధులన్నీ పరిశీలించి ఎక్కడా అపరిశుభ్ర వాతావరణం లేకుండా చర్యలు చేపడతాను.
- **లక్ష్మి, గాండ్లగూడెం పంచాయతీ క్యాదర్శి**
– **అశ్వారావుపేట, న్యూస్‌టుడే**

స్పందనకు వందనం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట మండలం నారాయణపురం- బచ్చువారిగూడెం మధ్య చిన్నంశెట్టి కృష్ణార్జునరావు వరి పొలం వద్ద తూర వేయకుండా రోడ్డుకు అడ్డుగా మట్టి పోయడంతో నీటమునిగిన వరిపొలంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో మంగళవారం ప్రచురితమవడంతో ర. భ. శాఖ డీఈఈ శ్రీనివాస్ స్పందించారు. అడ్డుగా ఉన్న మట్టిని జేసీబీతో తొలగించి నీళ్లు బయటకు పోయేలా చర్యలు చేపట్టారు.

'ఎమ్మెల్యే పాయం పర్యటనను జయప్రదం చేయండి'

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం నిర్వహించే మండల పర్యటనను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ కోరారు. మంగళవారం ఆయన ఆళ్లపల్లిలో విలేకరులతో మాట్లాడారు. బుధవారం ఉదయం అధికారులతో బోడాయికుంట, నడిమిగూడెం గ్రామ పంచాయతీ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం రాయగూడెం గ్రామ ప్రజలతో ముఖాముఖి సమావేశం ఉంటుందన్నారు.

సాగునీరు అందించాలి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: చివరి భూములకు తాలిపేరు ప్రాజెక్టు కాలువల ద్వారా సాగునీరు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. వైట్‌నాగారం, అంజుబాక గ్రామాల్లో సీపీఎం శాఖ మహా సభలు మంగళవారం నిర్వహించారు. కొర్సా చిలకమ్మ, చలమయ్య, చిన్నారావు, కామయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

ములకలపల్లి, న్యూస్‌టుడే: ములకలపల్లి తిమ్మంపేట పంచాయతీ పరిధిలోని వృద్ధులకు గ్రామానికి చెందిన జలగం లీలా సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో మంగళవారం రగ్గులను పంపిణీ చేశారు. చలికాలం నేపథ్యంలో అటవీ ప్రాంతంలోని గిరిజనులకు రగ్గులను పంపిణీ చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రావు, పాఠశాల హెచ్‌ఎం శంకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆళ్లపల్లి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవెంకటపురం గ్రామానికి చెందిన కల్తీ మంగయ్య ఉదయం సమయంలో వ్యవసాయ పనికి వెళ్లాడు. కడుపునొప్పి తట్టుకోలేక పురుగు మందు తాగాడు. వ్యవసాయ క్షేత్రం నుంచి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో ఇదిగో నేను తాగిన మందు అని చెప్పి కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ఆళ్లపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం పట్టణానికి తరలించారు.

కనకదుర్గ ఆలయంలో చోరీ

మణుగూరు, న్యూస్‌టుడే: మణుగూరులోని పాతసీఎస్పీ వద్ద ఉన్న కనకదుర్గ ఆలయంలో దొంగలు పడినట్లు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. రాత్రిపూట దొంగలు హుండీ పగులగొట్టి అందులోని సుమారు రూ.20 వేల నగదును అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సీఐ సతీశ్ మణుగూరులోని ఆలయానికి వెళ్లి చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.

అక్రమంగా నిల్వచేసిన టేకు కలప పట్టివేత

దుమ్ముగూడెం,న్యూస్‌టుడే: మండల పరిధి పెదనల్లబెల్లి గ్రామ శివారులో అక్రమంగా నిల్వచేసిన టేకు కలపను అటవీ శాఖ అధికారులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. గ్రామ శివారు ప్రాంతంలో గుర్తుతెలియని కొందరు ఈ కలపను ఉంచారు. సమాచారం అందుకున్న ఫారెస్టు రేంజి అధికారి కమల సిబ్బందితో వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కలప విలువ రూ.40వేలు ఉంటుందని అంచనా వేశారు. డీఆర్వో శ్రీనివాస్, ఎఫ్ఎస్‌వో నందా, ఎఫ్‌బీవో జ్యోత్స్న పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో అశ్వారావుపేట కోనేరు బజారుకు చెందిన తేజావత్ నాగలక్ష్మి మంగళవారం ఉదయం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బాధితురాలి తమ్ముడు రమేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై యయాతిరాజు తెలిపారు.

యువకుల సరదా.. చేపల వేట

కరకగూడెం మండలం తాటిగూడెం సమీప కుంటలోని చేపలను స్థానిక యువకులు మంగళవారం పట్టారు. జనరేటర్ సహాయంతో కుంటలోని నీటిని తొలగించారు. తర్వాత దోమతెరలను ఉపయోగించి చేపలు పట్టారు. – కరకగూడెం, న్యూస్‌టుడే



రైతు మాట.. మల్చింగ్ బాట

ఇటీవలి కాలంలో అధిక శాతం మంది రైతులు మల్చింగ్ బాట పడుతున్నారు. టమాట, పత్తి, మిరప పంటల సాగుకు ఇవి తప్పనిసరవుతున్నాయి. కలుపు మొక్కల బెడద, కూలీల కొరత వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు రైతులకు ఇవి ఓ వరంగా పరిణమించాయి. మునుముందు మరింత అధిక శాతం మల్చింగ్ సాగు అందుబాటులోకి వస్తుందని గోపాలపురంలో మల్చింగ్ వేసుకుంటున్న జగ్గారం గ్రామానికి చెందిన గుండ్రెడ్డి పెద్దిరెడ్డి అనే రైతు పేర్కొంటున్నారు. ఏఓ సాయి శంతన్‌కుమార్ మాట్లాడుతూ.. . మల్చింగ్ వల్ల మేలేనన్నారు. నీటి వినియోగం తగ్గుతుందన్నారు. అధిక కాలం తేమ నిలిచే అవకాశం ఉంటుందని చెప్పారు.
– అశ్వాపురం, న్యూస్‌టుడే



ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి భారతరత్న అబ్దుల్ కలాం జయంతిని భద్రాచలం శాఖా గ్రంథాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమాజ సేవకులు బిర్రు సుధాకర్ హాజరై కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మిఠాయిలు పంచారు. గ్రంథపాలకుడు జానీ సురేంద్ర, ప్రకాశ్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భద్రాచలం గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో..

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: కలాం జయంతిని దమ్మపేట రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తహసీల్దార్ అశోక్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పూలదండలు వేసి నివాళులర్పించారు. కలాం ఆశయ సాధనకు ప్రతిఒక్కరు పాటుపడాలని కోరారు.

నేడు పాల్వంచలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కొత్తగూడెం నియోజకవర్గంలోని పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం వైద్యశాలలో పది డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేశామని, పాల్వంచలో మరో ఐదు యంత్రాలు అందుబాటులోకి రానున్నాయని ఆయన తెలిపారు.

మహిళా శక్తి కాంగ్రెస్‌తోనే సాధ్యం

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: మహిళా శక్తి మహిళా కాంగ్రెస్‌తోనే సాధ్యపడుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న అన్నారు. సంఘ సర్వసభ్య సమావేశం లో ఆమె మాట్లాడుతూ మహిళా శక్తి గణనీయంగా పెంచడం కోసం ప్రతి ఒక్కరు మహిళా కాంగ్రెస్‌లో సభ్యులుగా చేరడంతో సమస్యల పరిష్కార దిశగా పోరాటం చేస్తున్నట్లు చెప్పారు.

సనాతన ధర్మ రక్షణకు లక్ష కి.మీ. యాత్ర

భద్రాచలం, న్యూస్‌టుడే: సనాతన ధర్మ రక్షణకు ద్విచక్రవాహనంపై లక్ష కిలో మీటర్ల యాత్రను చేపట్టిన నారాయణం వెంకటరెడ్డి సోమవారం రాత్రి భద్రాచలం చేరుకున్నారు. స్థానిక జీయర్ మఠం నిర్వహకుడు గట్టు వెంకటాచార్య సహకారంతో రాత్రికి మఠంలో వసతి పొందారు. మంగళవారం భద్రాచలంలో రాములవారిని దర్శించుకున్నారు. పర్ణశాల క్షేత్రాన్ని సందర్శించారు. బుధవారం భద్రాచలం శిశుమందిర్‌ను సందర్శించి విద్యార్థులకు సంస్కృత భాష విశిష్టతను, భగవద్గీత గొప్పతనాన్ని వివరించనున్నారు. 76 ఏళ్ల వయసున్న ఆయన ఈనెల 13న హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహన యాత్రను చేపట్టగా దానిని ఎంపీ రఘునందన్‌రావు ప్రారంభించారు. విశాఖ, తిరుపతి, తమిళనాడు, కర్ణాటక, కాశ్మీర్ వంటి ప్రాంతాల్లోని ప్రముఖ ఆలయాలను దర్శించనున్నట్లు తెలిపారు. రోజుకు 200 కి.మీ. చొప్పున 500 రోజుల్లో లక్ష కి.మీ ప్రయాణం చేయాలని సంకల్పించినట్లు తెలిపారు.



వెంకటాచార్యతో వెంకటరెడ్డి

'వామపక్షవాదులపై దాడులు సరికావు'

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: హక్కుల సాధనకు పీడిత ప్రజల పక్షాన పోరాటం సాగించే ప్రజాస్వామ్య, వామపక్ష వాదులపై దాడులు చేయడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా అన్నారు. మణుగూరులో మంగళవారం నిర్వహించిన ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తున్న ఉద్యమకారులు, ప్రొఫెసర్లు, మేధావులపై భాజపా ప్రభుత్వం కక్షపూరితంగా కేసులు పెడుతూ అందరినీ అణచివేయాలని చూస్తుందన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా పేదల కోసం తాము చేస్తున్న పోరాటాలు ఆపే ప్రసక్తేలేదన్నారు. పీడితవర్గాల ప్రజల కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరులను స్మరించుకుంటూ డిసెంబర్ 26న జరిగే సీపీఐ 100 సంవత్సరాల వేడుకను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య మాట్లాడుతూ... నియోజకవర్గ అభివృద్ధిలో సీపీఐ పాత్ర మరువలేనిదన్నారు. నాయకులు పుల్లారెడ్డి, వెంకన్న, ఎల్లయ్య, లక్ష్మీకుమారి, రాంగోపాల్, లక్ష్మీనారాయణ, మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, సురేష్, ప్రమీల, సుజాత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా

కాకినాడ నుంచి అయోధ్యకు సైకిల్‌యాత్ర

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: కాకినాడ నుంచి అయోధ్యకు నలుగురు రామభక్తుల బృందం సైకిల్‌పై బయలుదేరింది. ఈనెల 13న కాకినాడలో బయలుదేరిన ఈ బృందం మంగళవారం అశ్వారావుపేటకు చేరుకుంది. అశ్వారావుపేటలో సాయిబాబా ఆలయకమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికారు. కాకినాడకు చెందిన విత్తనాల హరి, కాలా శ్రీనివాసరావు, దారపు బాలారెడ్డి, వాసంశెట్టి భద్రం ఈ బృందంలో ఉన్నారు. 1600 కి.మీ. 25రోజుల పాటు సాగి ఈ సైకిల్ యాత్ర అయోధ్యకు చేరుకుంటుందన్నారు.



కంపెనీస్థాయి క్రీడలను ప్రారంభించిన జీఎం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థ క్రీడలు, క్రీడాకారులను ఏ ఇతర కంపెనీల్లో లేని విధంగా ప్రోత్సహిస్తోందని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో స్థానిక వైసీఓఏక్లబ్ 24 ఏరియా, సింగరేణి స్కూల్ గ్రౌండ్ నందు జరుగుతున్న కంపెనీ స్థాయి క్రీడలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఉద్యోగుల పని ఒత్తిడిని తగ్గించి వారిలో మానసికోల్లాసం కలిగించేందుకు క్రీడలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఆరు రీజియన్‌ల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, నజీర్ అహ్మద్, వెంకటేశ్వర్లు, సాయిస్వరూప్, అజయ్, రమేశ్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రారంభానికి ముందే.. శిథిలం..!

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే

విద్యావ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంతోపాటు, మండల విద్యాధికారి అందుబాటులో ఉండి పాఠశాలలను పర్యవేక్షించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో విద్యావనరుల కేంద్రం(ఎమ్మార్సీ) ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. స్థానిక జడ్పీ పాఠశాల ప్రాంగణంలో దీన్ని నిర్మించేందుకు రూ.30లక్షల నిధులు కేటాయించారు. అధికారుల పర్యవేక్షణలో పక్కా భవన నిర్మాణ పనులు కొంతకాలంపాటు చురుకుగా సాగినా.. నిధులలేమి కారణంతో గుత్తేదారు 80శాతం పనులు నిర్వహించి, అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ప్రస్తుతం అక్కడ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, చిన్నపాటి అడవిని తలపిస్తోంది. దీనికితోడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో భవన నిర్మాణానికి అక్కడక్కడా పగుళ్లు ఏర్పడి, శిథిలావస్థ దశకు చేరింది. పనులు ప్రారంభించి ఐదేళ్లు గడచినా ఎమ్మార్సీ కార్యాలయం అందుబాటులోకి రాకపోవడంతో మండల ప్రజలు పలు ఆరోపణలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

★ దీనిపై ఎంఈవో ఆనందకుమార్‌ని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఇటీవలే సంబంధిత అధికారులు, గుత్తేదారుతో మాట్లాడానని, త్వరలోనే పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు.



శిథిలావస్థలో దర్శనమిస్తున్న నూతన ఎమ్మార్సీ భవన నిర్మాణం

అధిక లోడు వాహనాలపై.. నియంత్రణ ఏదీ..?

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

భద్రాచలం పట్టణం మీదుగా ఇసుక, జామాయిల్ కర్ర తరలించే వాహనాలు అధికలోడుతో ఇష్టాను సారం వెళుతున్నా రవాణాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భద్రాచలం కేంద్రంగా ఎంవీఐ స్థాయి అధికారి ఉన్నా అధిక లోడు వాహనాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో మన్యంలో పలు ఇసుక ర్యాంపులు ఏర్పడ్డాయి. రోజుకు పదుల సంఖ్యలో జామాయిల్ పుల్లతో ట్రాక్టర్లు, ఇసుకతో టిప్పర్లు, లారీలు అధిక వేగం, లోడుతో తిరుగుతున్నాయి. వారం కిందట అధిక లోడుతో వస్తున్న ఇసుక లారీలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ ఇలాంటి వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

★ ఈ అంశంపై భద్రాచలం ఇన్‌ఛార్జి ఎంవీఐ మనోహర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కొత్తగూడెంలో విధులతో పాటు ఇక్కడా ఇన్‌ఛార్జిగా ఉన్నానని, తనిఖీలు నిర్వహించి చర్యలు చేపడతామని తెలిపారు.



'ఉపాధ్యాయ' ఓటు హక్కుకు నమోదు చేసుకోండి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు హక్కు నమోదు చేసుకోవాలని దమ్మపేట తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయుల సమావేశం మంగళవారం నిర్వహించారు. 2024 నవంబర్ 1కి కనీసం మూడేళ్ల సర్వీసు పూర్తయిన అధ్యాపకులు, స్కూల్ అసిస్టెంట్లు ఓటు హక్కుకు నవంబరు 6లోపు నమోదు చేయించుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని, లేదా రెవెన్యూ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

పంటల పరిశీలన

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిననల్లబెల్లి, రేగుబల్లి, పెదనల్లబెల్లి గ్రామాల్లో కొత్తగూడెం కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ, శాస్త్రవేత్తలు ఆర్.శ్రీనివాసరావు, బి.శివ మంగళవారం పర్యటించారు. రైతులతో కలిసి వరి, మిర్చి, పత్తి పంటలను, ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. పంటలకు సోకిన తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించి పిచికారి చేయాల్సిన మందులను సూచించారు.

పాపకొల్లు-భీమలపాడు రహదారిని నిర్మించాలి

జూలూరుపాడు, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల మధ్య మెరుగైన రవాణా సౌకర్యం కోసం జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు నుంచి కారేపల్లి మండలంలోని భీమలపాడు మధ్య బీటీ రహదారి నిర్మాణం చేపట్టాలని తెలంగాణ జనసమితి ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి గోపగాని శంకర్‌రావు డిమాండ్ చేశారు. మండలంలో మంగళవారం ఆయన పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా జూలూరుపాడు, కాకర్ల, అనంతారం, పడమటినర్సాపురం గ్రామాల్లో పర్యటించారు.

ప్రత్యేకాధికారిగా బాధ్యతల స్వీకరణ



ఇల్లెందు గ్రామీణం: మండల ప్రజా పరిషత్ ప్రత్యేకాధికారిగా ఇల్లెందు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా. కె.విజయ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో ధన్‌సింగ్, కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తగూడెం

•కొత్తగూడెం •ఇల్లెందు

మంత్రి పొంగులేటికి సన్మానం

టేకులపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం బూర్గంపాడు పర్యటనకు వెళ్తూ మార్గంమధ్యలో టేకులపల్లిలోని ఎమ్మెల్యే కోరం క్యాంపు కార్యాలయం వద్ద కాసేపు ఆగారు. నాయకులు ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. బోడ మంగీలాల్‌నాయక్, బానోత్ భద్రునాయక్, గడ్డం మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689



సమస్య: పాల్వంచ పట్టణం శ్రీనగర్‌కాలనీలో మురుగు కాలువలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. కాలువ పొడవునా పిచ్చిమొక్కలు పెరిగి దోమలు, విషపురుగులకు ఆవాసంగా మారాయి.

- మల్లేశ్, స్థానికుడు

సమాధానం: సంబంధిత ఏరియా జవాన్‌కు చెప్పి సమస్య పరిష్కరిస్తాం.

- కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి

– పాల్వంచ, న్యూస్‌టుడే



క్రీడాకారులకు అభినందనలు తెలుపుతున్న ఏరియా జీఎం జాన్ ఆనంద్

కంపెనీస్థాయి క్రీడలను ప్రారంభించిన జీఎం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థ క్రీడలు, క్రీడాకారులను ఏ ఇతర కంపెనీల్లో లేని విధంగా ప్రోత్సహిస్తోందని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో స్థానిక జేకేఎస్‌ఓసీ ప్రాజెక్ట్ 24 ఏరియా, సింగరేణి స్కూల్ గ్రౌండ్ నందు జరుగుతున్న కంపెనీ స్థాయి క్రీడలను మంగళవారం ఆయన ప్రారంభించారు. సింగరేణి వ్యాప్తంగా ఆరు రీజియన్ల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. శివప్రసాద్, మోహన్‌రావు, నజీర్ అహ్మద్, వెంకటేశ్వర్లు, సాయిస్వరూప్, అజయ్, రమేశ్‌సింగ్ పాల్గొన్నారు.
★ ఇల్లెందు జేకే-5 ఓసీ, 21 ఇంక్లైన్ భూగర్భగనిని కలుపుతూ ఏర్పాటు చేయనున్న నూతన ఓసీకి కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అనుమతినిచ్చినట్లు జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. ఓసీకి 151.85 హెక్టార్ల అటవీభూమి వినియోగించుకునేలా అనుమతులొచ్చాయన్నారు. మూణ్నాలుగు నెలల్లో స్టేజ్-1 పనులు ప్రారంభమవుతాయన్నారు.

సమాధులు కూల్చడం దుర్మార్గమైన చర్య

ఇల్లెందు గ్రామీణం: ఓ మతానికి చెందిన సమాధుల స్థలాన్ని కూల్చడం దుర్మార్గమైన చర్యని, ఇలాంటి విధానాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీసీసీ వైస్ ఛైర్మన్ అనిల్‌థామస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో కొద్దిరోజుల క్రితం ఓ వ్యక్తి సమాధులు కూల్చడంతో స్థలాన్ని పరిశీలించారు.

కొలువుల గ్రంథాలయం..!

కృషి, పట్టుదల ఉంటే విజయానికి ఏదీ అడ్డు కాదని నిరూపించారు గ్రామీణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన యువత. కొత్తగూడెం గ్రంథాలయాన్ని చదువుల వేదికగా మలచుకుని కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. శిక్షణకు తల్లిదండ్రులతో వెనకడుగు వేయకుండా గ్రంథాలయాలను ఉపయోగించుకుని వారు ఏ విధంగా చదివారో 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు. త్వరలో జాబ్ క్యాలెండర్ వెలువడనున్న నేపథ్యంలో సమయాన్ని వృథా చేయకుండా పుస్తకాలతో కుస్తీ పట్టాలని సూచిస్తున్నారు. – లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే





కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న ఉద్యోగార్థులు

లక్ష్యంతో చదివా..



డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నా. మా సోదరి కొత్తగూడెం సింగరేణిలో ఉద్యోగం చేస్తూ ఇక్కడే ఉంటోంది. నేను ఖమ్మం నుంచి కొత్తగూడెం వచ్చి అక్క వద్దే ఉండేవాడిని. రోజూ కొత్తగూడెం గ్రంథాలయానికి వచ్చి కానిస్టేబుల్ పోటీ పరీక్షకు చదివి ఎంపికయ్యా. ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణలో ఉన్నాను.

కనగటి రమేశ్, ఖమ్మం జిల్లా, రఘునాథపాలెం మండలం, గణేశ్వరం

శిక్షణ లేకుండానే




నేను 2020లో బీఎస్సీ పూర్తి చేశా. నాన్న చిన్నతనంలోనే చనిపోయారు. అమ్మ పంచాయతీలో కార్మికురాలిగా పని చేస్తూ చదవించింది. శిక్షణకు వెళ్లేందుకు ఆర్థికంగా లేకపోవడంతో రెండు సంవత్సరాల పాటు గ్రంథాలయానికి వెళ్లి సన్నద్ధమయ్యా. కానిస్టేబుల్‌గా ఎంపిక కావడంతో సంతోషంగా ఉంది.

మాలోత్ సాయికుమార్, సీతంపేట బంజరు, సుజాతనగర్

ప్రైవేటు ఉద్యోగం వదిలేసి..

శెగల శ్రీకాంత్, కిన్నెరసాని ఉల్వనూరు, (పాల్వంచ)



నేను 2016లో బీటెక్ పూర్తి చేసి 2022 వరకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం చేశా. 2022లో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కానిస్టేబుల్ ఉద్యోగానికి కొత్తగూడెం గ్రంథాలయంలో పుస్తకాలతో కుస్తీ పట్టా. ప్రణాళిక ప్రకారం చదివి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

తొలి ప్రయత్నంలోనే..



నేను 2022లో ఇంటర్ పూర్తి చేయగానే కానిస్టేబుల్ నోటిఫికేషన్ వెలువడింది. రోజూ కొత్తగూడెం గ్రంథాలయానికి వెళ్లి సన్నద్ధమయ్యా. తొలి ప్రయత్నంలోనే కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యా. నేను ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే మా కుటుంబ సభ్యుల కల నెరవేరింది.

కంగాల జయంత్, సీతారాంపురం, లక్ష్మీదేవిపల్లి మండలం

ప్రమాద ఘటనపై కేసు నమోదు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని హనుమంతులపాడుకు చెందిన కొత్త వెంకన్న తన కుమార్తెతో కలిసి సెప్టెంబరు 28న ద్విచక్రవాహనంపై సుభాష్‌నగర్ నుంచి వెళ్తున్నారు. ఎదురుగా ఇల్లెందువైపు వస్తున్న బొలెరో ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సునావత్ మేగ్యపై చర్యలు తీసుకోవాలని వెంకన్న ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి ఏఎస్సై అబ్దుల్ ఘని విచారణ చేస్తున్నారు.

ఇసుక తరలిస్తున్న డీసీఎం సీజ్

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తరలిస్తున్న డీసీఎంను రంగాపురంలో ఎస్సై సురేశ్ మంగళవారం పట్టుకున్నారు. డ్రైవర్, యజమాని చరణ్‌సింగ్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు పాల్వంచలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కొత్తగూడెం నియోజకవర్గంలోని పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం వైద్యశాలలో పది డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేశామని, పాల్వంచలో మరో ఐదు యంత్రాలు అందుబాటులోకి రానున్నాయని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం..

కొత్తగూడెం కలెక్టరేట్: కొత్తగూడెం ఉత్తర సెక్షన్ పరిధిలో జనమందిర్ 33/11కేవీ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని విద్యుత్తులైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ నర్మద మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం పట్టణంలోని ఎంజీ రోడ్, పెద్ద బజార్, చిన్న బజార్, నేతాజీ మార్కెట్, కూలీలైన్ బస్తీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని ఆందోళన

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: అసంపూర్తిగా ఉన్న వాటర్ ప్లాంట్ నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ 36వ వార్డు కౌన్సిలర్, స్థానికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ప్లాంట్ మంజూరైనా నిర్మించకుండా తాత్సారం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా చేపట్టి ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్ బి.శ్రీవల్లి, మహిళలు పాల్గొన్నారు.

'కులగణనను ఆపేందుకు కుట్రలు చేస్తే సహించం'

ఇల్లెందు గ్రామీణం: కులగణనను ఆపేందుకు కుట్రలు చేసినా, అడ్డుపడినా సహించేది లేదని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కాంపాటి నరేశ్ హెచ్చరించారు. పట్టణంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణనను వెక్కిరిస్తూ కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు.

మహిళా శక్తి కాంగ్రెస్‌తోనే సాధ్యం

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: మహిళా శక్తి మహిళా కాంగ్రెస్‌తోనే సాధ్యపడుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న అన్నారు. సంఘ సర్వసభ్య సమావేశం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మహిళా శక్తి గణనీయంగా పెంచడం కోసం ప్రతి ఒక్కరు మహిళా కాంగ్రెస్‌లో సభ్యులుగా చేరడంతో సమస్యల పరిష్కార దిశగా పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. లక్ష్మి, అనిత, కృష్ణవేణి, ఆదిలక్ష్మి, శాంతి పాల్గొన్నారు.

ఏరియా సమస్యలు పరిష్కరించండి

కొత్తగూడెం సింగరేణి: కొత్తగూడెం ఏరియా సమస్యలను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ జనక్‌ప్రసాద్ ఏరియా జీఎం షాలేమురాజును కోరారు. ఏరియా జీఎంను మంగళవారం కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నర్సింహారెడ్డి, త్యాగరాజన్, వికాస్, ఆల్బర్ట్ పాల్గొన్నారు.

'కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం'

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మోదీ ప్రభుత్వం కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను చట్టాల సరవణ పేరుతో కాలరాస్తోందని మాస్‌లైన్ అనుబంధ ఇఫ్టు జిల్లా ప్రధాన కార్యదర్శి యాకుబ్‌షావలి ఆరోపించారు. మాస్‌లైన్ అనుబంధ ఇఫ్టు టీయూసీఐలో ఈ నెల 20న విలీనాన్ని పురస్కరించుకుని మంగళవారం ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీయూసీఐలో ఇఫ్టు విలీనం దేశవ్యాప్తంగా బలమైన కార్మికోద్యమాలను నిర్వర్తించడమే లక్ష్యమన్నారు. వెంకన్న, వెంకటేశ్వర్లు, బోసు పాల్గొన్నారు.

'అరెస్టులు అప్రజాస్వామికం'

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లాలోని దామగుండంలో రాడార్‌స్టేషన్ ఏర్పాటుతో 12లక్షల వృక్షాలు గల అడవి అంతరించిపోతోందని, ఇలాంటి దుశ్చర్యను ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు వ్యతిరేకిస్తే అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని ఎన్డీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు ఆరోపించారు. ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగేశ్వరరావు, ప్రకాశ్, జానకి, సారంగపాణి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ లాల్‌చంద్ హెచ్చరించారు. విత్తన, పురుగు మందుల దుకాణాల నిర్వాహకులతో ఇల్లెందులో మంగళవారం సమావేశం నిర్వహించారు. యాసంగిలో విత్తనాలు, ఎరువుల లభ్యత, విక్రయాల్లో అమలవుతున్న చట్టాలపై అవగాహన కల్పించారు.

వ్యక్తిపై కత్తితో దాడి

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. చుంచుపల్లి మండలం శ్రీ ఇంక్లైన్‌కి చెందిన రెడిరాజుల నరహరి బ్యాంకు పని మీద రుద్రంపూర్ వెళ్లారు. అదే ప్రాంతానికి చెందిన కొంకటి సత్యనారాయణ అలియాస్ సత్తి మద్యం మత్తులో బ్యాంకులో ఉన్నారు. వారిద్దరూ స్నేహితుల కావడంతో పలకరించుకున్నారు. అప్పటికే బ్యాంకులో అలజడి చేస్తున్న సత్తి స్నేహితుడిని చూసి ఆప్యాయంగా ముచ్చటించుకున్నారు. ఒకే సారి అమాంతంగా తన జేబులో ఉన్న కత్తితో నరహరిపై దాడి చేసి పారిపోయారు. నరహరి మెడకు స్వల్ప గాయమైంది. విషయం తెలిసిన పోలీసులు విచారణ చేపట్టారు.

నిజమే.. ఆలోచించరూ!



కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: వాహనాలు వేగంగా నడపటం వల్ల నేటి యువత విలువైన ప్రాణాలు కోల్పోవడంతో పాటు ఇతరుల ప్రాణాలకు హాని తలపెడుతున్నారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనానికి నంబర్‌ప్లేటుపై '90 తాగకు, 90 వెళ్లకు, 108 ఎక్కకు' అంటూ రాసిన కొటేషన్ అందరినీ ఆలోచింపజేస్తోంది. అది చూసిన పలువురు వాహన వేగాన్ని తగ్గిస్తున్నారు.

జనావాసాల్లో సరే.. వనాల్లో?

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: పర్యావరణం, మానవాళికి ప్రమాదకరమైన కోనోకార్పస్ చెట్లను పట్టణంలోని కొన్ని చోట్ల తొలగించారు. పట్టణ ప్రకృతి వనాలతో పాటు పలు పల్లె ప్రకృతి వనాల్లోనూ ఈ చెట్లు పచ్చదనంతో కనువిందు చేస్తుండటంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కమిషనర్ యాదగిరిని వివరణ కోరగా.. ప్రధాన రహదారుల్లో తొలగించామని, మిగిలిన చోట్ల ఉన్న మొక్కలను కూడా తొలగిస్తామని తెలిపారు.



19వ వార్డులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టణ ప్రకృతి వనంలో కోనోకార్పస్ మొక్కలు

రైతులందరూ బీమా చేయించుకోవాలి



మాట్లాడుతున్న వీరహనుమంతరావు

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: ప్రతి రైతు తప్పనిసరిగా డీసీసీబీ బ్యాంకులో బీమా చేయించుకోవాలని కొత్తగూడెం పీఏసీఎస్ అధ్యక్షుడు మండే వీరహనుమంతరావు అన్నారు. నాబార్డ్ వారి సహకారంతో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా మండలంలోని హేమచంద్రాపురం, మైలారం పంచాయతీల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్రాంచి మేనేజర్ శాంతి రాగమయి, సంఘం ఉపాధ్యక్షుడు కూచిపూడి జగన్, డైరెక్టర్ రాంచందర్, ఎఫ్ఎల్‌సీ అశోక్, సీఈవో సారయ్య పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో వసతులు కల్పించండి

పాల్వంచ, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీనివాసకాలనీలోని మినీ స్టేడియంలో కావాల్సిన అన్ని రకాల వసతులు సమకూర్చాలని డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు రాష్ట్ర క్రీడల ఛైర్మన్ శివసేనారెడ్డిని కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను స్టేడియంలో మంగళవారం సత్కరించారు. ప్రధానంగా స్విమ్మింగ్‌పూల్, ఇండోర్ స్టేడియం, వాకింగ్ ట్రాక్, 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల చెల్లింపులపై స్పందించండి

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: ఉపకార వేతనాలు, ఫీజు చెల్లింపులపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ఫహీం, పీడీఎస్‌యూ చంద్రన్నవర్గం కార్యదర్శి గణేశ్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటైన వృత్తాకారబల్ల సమావేశంలో మంగళవారం వారు మాట్లాడారు. శివప్రశాంత్, పార్థసారథి, సాయికుమార్, రాంచరణ్, ఉపేందర్, వరలక్ష్మి, ముకుందారెడ్డి పాల్గొన్నారు

ప్రసాద్, రాజేశ్వరరావు సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న వెస్లీ చిత్రంలో సంఘం సభ్యులు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు జి.వి.బి.ప్రసాద్, అన్నవరపు రాజేశ్వరరావుల మృతి తీరనిలోటని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.జి.ఆర్ వెస్లీ అన్నారు. వారి సంస్మరణ సభ మంగళవారం కొత్తగూడెంలోని ఆ సంఘ కార్యాలయంలో నిర్వహించారు. చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు సంఘానికి విశేష సేవలందించారని కొనియాడారు. ఎల్.రాములు, ఆర్.వెంకటేశ్వరరావు, పాపయ్య, శేషగిరిరావు, కేశిరెడ్డి, నారాయణరావు, ప్రసాద్, మోహన్‌రావు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీలకు న్యాయం చేయాలని డిమాండ్

పాల్వంచ: పురపాలికలోని మెప్మాలో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న మెప్మాలోని ఆర్పీలకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. పాల్వంచ సీపీఐ కార్యాలయంలో మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆర్పీలకు నెలకు రూ.26 వేల వేతనం అందించాలన్నారు. జమలయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కేటీపీఎస్ ఆసుపత్రిలో ఉద్యోగుల ఆందోళన

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ కేటీపీఎస్ ఆసుపత్రిలో ఉద్యోగులకు సరైన చికిత్స అందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆ సంఘం ఉద్యోగులు మంగళవారం ఆందోళన చేపట్టారు. కేటీపీఎస్ అయిదో దశ కోల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న పద్మారావు జూనియర్ ప్లాంట్ అటెండెంట్(జేపీఏ) గుండెలో నొప్పి, మంట రావడంతో హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లారు. ఆ సమయంలో వైద్యురాలు సింధుపల్లవి చికిత్స అందించడంలో అలసత్వం వహించారని ఆరోపిస్తూ నాయకులు నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న సీఈ మేక ప్రభాకర్‌రావు ఆసుపత్రికి వెళ్లి వైద్యురాలితో మాట్లాడారు. సరైన సమయంలో స్పందించాలని ఆదేశించారు. ఆందోళనకారులకు సర్ది చెప్పడంతో ఉద్యోగులు శాంతించారు.



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు



సీఎం కప్ ర్యాలీలో పాల్గొన్న అధికారులు, యువకులు

సీఎం కప్ ర్యాలీ సందడి

జూలూరుపాడు, న్యూస్‌టుడే: సీఎం కప్ ర్యాలీ మంగళవారం జూలూరుపాడుకు చేరుకుంది. ఈ సందర్భంగా అధికారులు, విద్యార్థులు, యువకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం క్రీడా జ్యోతిని పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ... చదువుతోనే కాకుండా క్రీడల్లో రాణించడం ద్వారా కూడా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని, దీనికి క్రికెటర్ మహ్మద్ సిరాజ్ జీవితమే ఉదాహరణగా పేర్కొన్నారు. ఎంపీడీవో రవి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య, సీఎం కప్ నోడల్ అధికారి మధు, స్పోర్ట్స్ అథారిటీ సభ్యులు గోకుల్, రత్నకుమార్‌బోస్, అకాడమి కోచ్ గౌస్, పంచాయతీ కార్యదర్శులు హరిబాబు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సలహాలతో సాగుకు భరోసా



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బాబురావు, చిత్రంలో సహాయ సంచాలకుడు నర్సింహారావు తదితరులు

సుజాతనగర్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలను అవగాహన చేసుకుని రైతులు సాగులో ఆచరించాలని జిల్లా వ్యవసాయాధికారి బాబురావు పేర్కొన్నారు. సుజాతనగర్ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన 'రైతునేస్తం' కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతికూల వాతావరణంతో వ్యాపించే తెగుళ్ల నివారణ, సస్యరక్షణకు శాస్త్రవేత్తలిచ్చే సూచనలు ఉపయోగపడతాయని డీఏవో తెలిపారు. అనంతరం సహాయ సంచాలకుడు నర్సింహారావు సుజాతనగర్‌లోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఏవో నర్మద, ఏఈఓలు శరత్‌చంద్ర, ప్రనూష, నర్సింహారావు పాల్గొన్నారు.

చేపల సొసైటీలో అవినీతిని వెలికితీయండి

టేకులపల్లి, న్యూస్‌టుడే: గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం బేతంపూడిలో అన్ని అర్హతలు ఉన్నా తనకు సభ్యత్వం ఇవ్వకుండా సొసైటీ ఛైర్మన్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని రోళ్లపాడు గ్రామానికి చెందిన కొడెం బాలకృష్ణ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023లో రోళ్లపాడు గ్రామానికి చెందిన 17 మంది సభ్యులు మత్స్యశాఖ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నారని తెలిపారు. సొసైటీలో చేరేందుకు తమ సభ్యత్వాలు ఆలస్యం కావడంతో తాను తోటి సభ్యులతో మాట్లాడి విషయాన్ని 2024 జూన్‌లో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. 16 మందికి సభ్యత్వం ఇచ్చిన ఛైర్మన్, తనకు మాత్రం ఇవ్వలేదని ఆరోపించారు. సంఘంలో జరుగుతున్న అవినీతిని వెలికితీయాలని ఉన్నతాధికారులను కోరారు. చీమల రామస్వామి పాల్గొన్నారు.

కార్మికులకు బోనస్ పోరాట ఫలితమే

టేకులపల్లి, న్యూస్‌టుడే: కేటీసీలో ఓబీ కార్మికులకు దసరా బోనస్ ఇప్పించాలని ఐఎన్‌టీయూసీ గౌరవ సలహాదారు కోరం సురేందర్ ఆధ్వర్యంలో ఎల్ఎస్ఎన్ యాజమాన్యం, కేటీసీ పీఓతో చర్చల మూలంగానే మంగళవారం నుంచి కార్మికుల ఖాతాల్లో బోనస్ జమైందని ఐఎన్‌టీయూసీ కేటీసీ ఓబీ యూనియన్ అధ్యక్షుడు ముచ్చా సుధాకర్ తెలిపారు. సైదులు, నరేశ్, చంద్రమౌళి, సతీష్, నగేశ్, సీతారాములు, సాయి పాల్గొన్నారు.
★ రాజకీయ ఐకాస పోరాట ఫలితమే కేటీసీ ఎల్ఎస్ఎన్ ఓబీ కార్మికుల ఖాతాల్లో దసరా బోనస్ జమైందని ఐకాస కన్వీనర్ లక్కినేని సురేందర్‌రావు, తెలిపారు. టేకులపల్లిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వంద మస్టర్లు ఉన్న ప్రతి కార్మికుడికి బోనస్ ఇవ్వాలని, కార్మికుల వివరాలను నోటీస్‌బోర్డుపై ఉంచాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. దళ్‌సింగ్‌నాయక్, డి.ప్రసాద్, వెంకటేశ్వర్లు, వీరబ్రహ్మాచారి, హర్జ్యా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కేటీసీలో ఓబీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఎల్ఎస్ఎన్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాజకీయ ఐకాస కన్వీనర్ లక్కినేని సురేందర్‌రావు అన్నారు. ఓబీ కార్మికుల సమస్యలను తెలియజేస్తూ టేకులపల్లి సీఐ తాటిపాముల సురేశ్‌ను రాజకీయ ఐకాస నాయకులు కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ప్రసాద్, వీరబ్రహ్మాచారి, సుందర్, వెంకటేశ్వర్లు, దళ్‌సింగ్‌నాయక్, శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ కేటీసీ ఓబీ యూనియన్ ప్రెసిడెంట్ సుధాకర్

పట్టువదలని మాస్టారు..!

వరుసగా మూడు ఉద్యోగాలు కైవసం

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే

ఆయన పట్టుదల ముందు సర్కారు కొలువులు వరుసకట్టాయి. నెలల వ్యవధిలోనే మూడు ఉద్యోగాలు దక్కాయి. ఇరవై ఏళ్లుగా ప్రైవేటు విద్యాలయాల్లో బోధన చేస్తున్నా.. ఇంకోవైపు కుటుంబ బాధ్యతలు మోస్తూనే ప్రభుత్వ కొలువుపై ఉన్న ఆసక్తితో సిద్ధమయ్యారు. వరుసగా రోజుల వ్యవధిలో వెల్లడైన ఉద్యోగ నోటిఫికేషన్ల ఫలితాల్లో వరుస విజయాలు సాధించి నేటి నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలిచారు. ఆయనే.. భద్రాచలం పట్టణం ఎంపీ కాలనీకి చెందిన పోలిశెట్టి నాగేశ్వరరావు, సుభద్రాదేవి తనయుడు సాయిరామకృష్ణ. సాయిరామకృష్ణ ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు మారుమూల భద్రాచలంలోనే పూర్తిచేశారు. పాల్వంచలోని ఓ కళాశాలలో బీఈడీ చదివారు. విద్యాభ్యాసం పూర్తయిన అనంతరం భద్రాచలం పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో బోధన చేస్తూ వచ్చారు. ఇంకోవైపు సర్కారీ కొలువు ఆయన కల. ఇందుకోసం ఎలాంటి ప్రత్యేక శిక్షణ లేకుండా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. తొలుత ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) గణిత ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. 2024, ఆగస్టు 1 నుంచి పాల్వంచ సాంఘిక సంక్షేమ గురుకులంలో బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు 2008లో రాసిన డీఎస్సీ ఫలితాలు సుదీర్ఘకాలం తర్వాత ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఆ పరీక్షలోనూ ఆయన ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన డీఎస్సీ-2024లోనూ సాయి రామకృష్ణ సత్తా చాటారు. తాజాగా వెల్లడైన ఫలితాల్లో జిల్లా స్థాయిలో 4వ ర్యాంక్‌తో స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) మ్యాథ్స్ ఉపాధ్యాయుడిగా నియామక పత్రం అందుకున్నారు. ఇలా ఆగస్టు నుంచి ఇప్పటి వరకు వరుసగా మూడు ఉద్యోగాలు దక్కించుకున్న సందర్భంగా ఉపాధ్యాయులు, బంధుమిత్రులు అభినందించారు.



తాజాగా ఎస్ఏ ఉపాధ్యాయ నియామక పత్రంతో సాయిరామకృష్ణ

★ భార్య సునందకుమారి, ఇద్దరు పిల్లలున్నారు. మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బోధన చేయడానికి డీఈఓ వెంకటేశ్వరాచారి చేతుల మీదగా ఆర్డర్ కాపీ సొంతం చేసుకున్నారు. పట్టుదలతో ఏళ్లపాటు నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది.